



స్టార్ హోటళ్లను తలదన్నేలా ప్యాలెస్ లోపలి మార్గం

వీడిన రాజకోట రహస్యం



రుషికొండ ప్యాలెస్

రుషికొండపై ఇంద్ర భవనాన్ని మీడియాకు చూపించిన ఎమ్మెల్యే గంటా

కళ్లు చెదిరే నిర్మాణాలతో అవాక్కైన జనం

- పేదోడి ఇంటి కంటే రెండింతలు పెద్దదిగా బాత్రూమ్‌లు
- జగన్ కోసం ఆధునికత ఉట్టిపడేలా సామగ్రి
- ఫ్యాన్ నుంచి బాత్రూమ్ కమోడ్ వరకు ఖరీదైనవే
- ఏడు బ్లాకుల్లో సాగిన నిర్మాణాలు
- ఒక్కో బ్లాక్‌కు రూ.కోట్లలో వ్యయం
- అడ్డగోలు భవనంలో ఎన్నెన్నో విచిత్రాలు



ప్యాలెస్‌లో సువిశాలమైన హాల్

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మోజుపడి, నిబంధనలను తోసి రాజని రుషికొండపై నిర్మించిన ప్యాలెస్ గుట్టు వీడింది. రాజమహల్‌ను తలదన్నే రీతిలో అత్యాధునిక హంగులు, ఆర్భాటాలతో ఏడు బ్లాకుల్లో నిబంధనలకు విరుద్ధంగా, కోర్టులను బురిడీ కొట్టించి మరీ సాగించిన నిర్మాణాలను భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రజలకు చూపించే ప్రయత్నం చేశారు.

కూటమిలోని మూడు పార్టీల నాయకులు, మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని మరీ ప్యాలెస్‌కు వెళ్లిన గంటా.. ఏడు బ్లాకుల్లో నిర్మితమైన భవనాల్లోని అనువణువును బయట ప్రపంచానికి బహిర్గతం చేశారు. తానో నిరుపేదను అన్నట్టుగా కలరింగ్ ఇచ్చే జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత విలాసవంతంగా ప్రజాధనంతో నిర్మించిన రాజమహల్‌లోని బాత్రూమ్ కూడా సాధారణ ప్రజలు నివసించే ఇంటికి రెండింతలు ఉండడం గమనార్హం.

మూడేళ్లుగా నిర్మాణం

గడిచిన మూడేళ్లుగా సాగుతున్న ఈ భవన నిర్మాణం గురించి రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరిగింది. ఈ నిర్మాణంపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ, నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు అధికారిక ప్రకటన చేయలేదు. ఒక్కోసారి ఒక్కో రీతిన ప్రకటనలు జారీచేసినా.. వాటిలో ఏది నిజమో ఇప్పటికీ తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఎన్నికలకు కొద్దిరోజులు ముందు అప్పటి పర్యాటకశాఖా మంత్రి రోజా హడావిడిగా ఈ భవనాలను ప్రారంభించి వెళ్లిపోయారు. అయితే, దీనిని దేనికి వినియోగిస్తారన్న విషయం మాత్రం చెప్పలేదు.



రుషికొండ ప్యాలెస్‌లోకి వెళ్తున్న ఎమ్మెల్యే గంటా



రెండో బ్లాక్ ఎదురుగా తీర్చిదిద్దిన లాన్

అంతర్జాతీయస్థాయిలో...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రుషికొండపై నిర్మించిన రాజమహల్ గుట్టును

... మిగతా 4వ పేజీలో

పల్లాకు పట్టాభిషేకం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం



పల్లాను అభినందిస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు

- ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు
- ఉత్తరాంధ్ర నుంచి మూడో వ్యక్తికి పార్టీలో కీలక పదవి

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నియామకఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత పార్టీ పదవి నుంచి వైదొలిగారు. ఈ నేపథ్యంలో ఆ పదవిలో పల్లా శ్రీనివాసరావును నియమించాలని అధినేత చంద్రబాబు మూడు రోజుల క్రితమే నిర్ణయించి, ఆ విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు.అయితే ఆదివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.

తాజా ఎన్నికల్లో రాష్ట్రంలోనే గాజువాక అసెంబ్లీ స్థానం నుంచి అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన పల్లా శ్రీనివాసరావుకు మంత్రి పదవి వస్తుందని అంతా భావించారు. పదవుల పంపకంలో సమీకరణల నేపథ్యంలో పల్లాకు మంత్రి పదవి రాలేదు. ఈ నేపథ్యంలో

... మిగతా 4వ పేజీలో

జీవీఎంసీపై స్మార్ట్‌సిటీ భారం!


ఈనెలాఖరుతో ముగియనున్న మిషన్ కాలపరిమితి

- నగరంలో రూ.2,100 కోట్లతో 51 ప్రాజెక్టులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో పదేళ్లు నిర్వహణ
- గడువు ముగిస్తే ఏమిటనే దానిపై సందిగ్ధం
- రాష్ట్ర ప్రభుత్వానికి లేఖరాసిన అధికారులు

స్మార్ట్‌సిటీ ప్రారంభం: 2015

చేపట్టిన ప్రాజెక్టులు: 51

చేసిన ఖర్చు: సుమారు రూ.2వేల కోట్లు



జీవీఎంసీలోని కమాండ్ కంట్రోల్‌రూం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన 'స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల' నిర్వహణ భారం జీవీఎంసీ నెత్తినపడే పరిస్థితి కనిపిస్తోంది. 2015లో ప్రారంభమైన స్మార్ట్‌సిటీ మిషన్ ఈ ఏడాది జూన్ నెలాఖరుతో ముగుస్తోంది. ఇంతవరకూ ఈ పథకం కింద చేపట్టిన ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైదొలగనున్నాయి. అంతేకాక నిర్వహణపై కేంద్రం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల కాకపోవడంతో జీవీఎంసీయే ఆ భారం భరించాల్సి వస్తుందనే ఆందోళనలో అధికారులున్నారు.

నగరాల్లో నివసించే ప్రజలకు సుస్థిర అభివృద్ధితో కూడిన ఆరోగ్యప్రదమైన జీవనం, మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2015లో స్మార్ట్‌సిటీ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. మొదటి సంవత్సరం దేశవ్యాప్తంగా 20 నగరాలను ఎంపిక చేయగా అందులో విశాఖ చోటుదక్కించుకుంది. ప్రతి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్‌సిటీ మిషన్‌కు రూ.వంద కోట్లు చొప్పున కేటాయించి నగరాల్లో అత్యాధునిక సదుపాయాలను కల్పించేలా రూపకల్పన చేశారు. ఆ మొత్తానికి సమానంగా స్థానిక సంస్థలు తమ వాటా కింద నిధులు సర్దుబాటు చేయాలని నిబంధన విధించారు. స్మార్ట్‌సిటీ మిషన్ అమలు, పర్యవేక్షణ కోసం జీవీఎంసీ పరిధిలో గ్రేటర్ విశాఖ స్మార్ట్‌సిటీ లిమిటెడ్ (జీవీఎస్ఎస్ఎల్)ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. జీవీఎస్ఎస్ఎల్‌కి ప్రాజెక్టుల రూపకల్పన, అమలు, పనుల పర్యవేక్షణలో సహకరించేందుకు ఢిల్లీలోని ఓ ప్రైవేటు ఏజెన్సీని కేంద్రమే ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించింది. ఏజెన్సీతోపాటు జీవీఎంసీలోని ఇంజనీరింగ్, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు సభ్యులుగా ప్రాజెక్టు మోనటరింగ్ కమిటీ (పీఎంసీ)ని ఏర్పాటు చేశారు. జీవీఎస్ఎస్ఎల్ సీఎండీ హోదాలో జీవీఎంసీ కమిషనర్ పీఎంసీతో కలిసి స్మార్ట్‌సిటీ కింద చేపట్టాల్సిన పనులను గుర్తించడం, నిధులు ఖర్చు, పనుల పర్యవేక్షణ బాధ్యతలను కేంద్రం అప్పగించింది. స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేసేందుకు మొత్తం నగరాన్ని ఎంపిక చేస్తే నిధుల సమస్య ఎదురవడం ఖాయమని గుర్తించిన జీవీఎస్ఎస్ఎల్ అధికారులు బీచ్‌రోడ్డుని ఆనుకుని కోస్టల్‌బ్యాటరీ నుంచి జగదాంబ కూడలి, సిరిపురం జంక్షన్, పెదవాల్తేరు, పార్క్‌హోటల్ జంక్షన్ మధ్య ఉన్న 1,650 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రాంతాన్ని స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేసేందుకు ఏరియా బేస్డ్ డెవలప్‌మెంట్ (ఏబీడీ)గా ఎంపిక చేశారు. ఆ ప్రాంతంలో స్మార్ట్‌రోడ్లు, స్మార్ట్ లైటింగ్, 24/7 నీటిసరఫరా, విపత్తులను ముందుగానే గుర్తించి సమాచారాన్ని తెలియజేయడం ద్వారా నష్ట నివారణకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోనే సిటీ ఆపరేషన్ సెంటర్ (కమాండ్ కంట్రోల్‌రూమ్) ఏర్పాటు, నగరమంతటా స్మార్ట్‌పోల్స్, ముడసర్లోవ రిజర్వాయర్‌లో ఫ్లోటింగ్ సోలార్, స్మార్ట్ సిగ్నల్స్, సీసీ కెమెరాలు, 27 ఉన్నత పాఠశాలల్లో స్మార్ట్ క్యాంపస్‌లు, జీవీఎంసీకి చెందిన

... మిగతా 4వ పేజీలో



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, గండి బాబ్జీలను మర్యాదపూర్వకంగా కలిసిన హోంమంత్రి వంగలపూడి అనిత

నేతల ఇళ్లకు హోంమంత్రి అనిత

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆదివారం నగరానికి వచ్చిన వంగలపూడి అనిత ఎమ్మెల్యేలు, నేతలను వారి ఇళ్లకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా మంత్రులు బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రభుత్వ అతిథిగృహం, పార్టీ కార్యాలయానికి వస్తే అక్కడే ఎమ్మెల్యేలు, నేతలు కలిసి అభినందిస్తారు. దీనికి భిన్నంగా అనిత ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి, విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల ఇళ్లకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ కార్యాలయానికి వెళ్లి వారి ఆశీస్సులు తీసుకున్నారు.

తూకంలో గోల్‌మాల్

గోదాముల్లోనే మతలబులు

- రేషన్ సరకుల తూకం
- పంచదార, గోధుమపిండి, రాగిపిండి, కందిపప్పు ప్యాకెట్లలో తరుగు
- గోదాముల్లో తూకం లేకుండా డీలర్లకు పంపిణీ
- ఎక్కువ శాతం బినామీలు కావడంతో అధికారుల ఇష్టారాజ్యం
- పౌరసరఫరాల శాఖా మంత్రి దృష్టి సారించాలని వినతి



గోదాముల్లో కందిపప్పు, ఆయిల్, ఇతర వస్తువులు తూకం వేస్తున్న అధికారులు

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు ఇచ్చే కందిపప్పు, బియ్యం, నూనె, ఇతర సరుకుల తూకంలో తేడాలున్నాయని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నుంచి అధికారులు గోదాముల్లో తనిఖీలు ప్రారంభించారు. అయితే పౌరసరఫరాల సంస్థ నిర్వహించే గోదాముల నుంచి రేషన్ డీలర్లకు

... మిగతా 4వ పేజీలో

ప్రశాంతంగా యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష

విశాఖపట్నం/ఎంవీపీ కాలనీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. 9,735 మంది దరఖాస్తు చేయగా 4,677 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. కృష్ణ కళాశాల, ఎంవీపీ కాలనీలోని గాయత్రి కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ మల్లికార్జున తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు.



ఎంవీపీ కాలనీలోని గాయత్రి కళాశాలలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఇండస్ట్రీస్ సేఫ్టీ కోర్సుల అభ్యర్థులకు ప్రాక్టికల్స్



రక్షణపై అవగాహన కల్పిస్తున్న అభ్యర్థులు

కంచరపాలెం, జూన్ 16: ఇండస్ట్రీస్ సేఫ్టీ కోర్సుల అభ్యర్థులకు కంచరపాలెం కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఫైర్ & సేఫ్టీ కోర్సుల అభ్యర్థులకు కళాశాలల ప్రాంగణంలో ప్రాక్టికల్స్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ ఎ.వరహాలు పర్యవేక్షణలో సేఫ్టీ కోర్సుల బోధకుడు డి. తులసీరావు విద్యార్థులకు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవిస్తే తక్షణం చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రమాదాల రక్షణపై నిర్వహించిన ప్రాక్టికల్స్ ఆకట్టుకున్నాయి. వివిధ పరిశ్రమల నుంచి 23 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

పర్యాటక రంగానికి విశాఖ స్వర్గధామం



పర్యాటక సంస్థను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మహారాణిపేట, జూన్ 16: పర్యాటక రంగానికి విశాఖ స్వర్గధామంగా నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు గణబాబు అన్నారు. ఆదివారం నగరంలోని లయన్స్ క్లబ్ సమీపంలోని ఉడా కాంప్లెక్స్ భవనంలో టూరిజంనకు సంబంధించి మేక్ మై ట్రిప్ సంస్థ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలు, ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు అందుబాటులో ఈ ప్రాంతీయ కార్యాలయం విశాఖలో ఏర్పాటు చేయటం విశేషమని తెలిపారు. విశాఖ వాసులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానం ద్వారా పర్యాటక టూర్‌లు బుకింగ్ చేసుకొనే సౌలభ్యం అందుబాటులోకి వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, సంస్థ మేనేజర్ ఎ. సతీష్, మనీష్ , భారతి, వైభవ్, బబిత తదితరులు పాల్గొన్నారు.

30న రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ మీట్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 16: పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 30న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పారా (దివ్యాంగుల) అథ్లెటిక్స్ మీట్ నిర్వహించనున్నట్టు సంఘం కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. నగరంలో నిర్వహించే ఈ టోర్నీలో రన్స్, త్రోస్, జంప్ ఈవెంట్లలో ప్రతిభ కనబరిచిన అథ్లెట్లను జూలై 15 నుంచి జరిగే జాతీయ పారా అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 25వ తేదీలోగా ఫోన్:70135 69514, 93901 31777లలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సీతారామం భజామ్యహం పుస్తకావిష్కరణ

సీతంపేట, జూన్ 16: డా.సుసర్ల గోపాలశాస్త్రి శతజయంతి ఉత్సవాల సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో శ్రీ సుసర్ల రామగోపాల్ రచించిన 'సీతారామం భజామ్యహం' పుస్తకావిష్కరణ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా డా.కోలవెన్ను మలయవాసిని హాజరై ఆవిష్కరించారు. సభాధ్యక్షులు డా. గండికోట రఘురామారావు, పుస్తక పరిచయం డా.పేరి రవికుమార్, రచయిత స్పందన సుసర్ల రామగోపాల్‌గావించారు.

సీపీఎం కమిటీకి రూ.లక్ష విరాళం



సీపీఎం నాయకులకు చెక్‌ను అందజేస్తున్న సత్యనారాయణ

కంచరపాలెం/ మురళీనగర్, జూన్ 16: పోర్టులో ఉద్యోగ విరమణ పొందిన మాధవధార ప్రాంతానికి చెందిన కూన సత్యనారాయణ సీపీఎం జిల్లా కమిటీకి రూ.లక్ష విరాళంగా ఆదివారం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి. కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, బి. జగన్‌లకు ఈ చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎం. జగ్గునాయుడు, ఎం.వి.ఎస్.శర్మ, ఎ. అజయ్‌శర్మ, డా.బి. గంగారావు తదితరులు సత్యనారాయణ సేవలను కొనియాడారు. సత్యనారాయణ చిన్ననాటినుంచి ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తూ వస్తున్నారన్నారు. పోర్టు కార్మికుల సమస్యలపై, పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తనదైన శైలిలో ఉద్యమం చేశారన్నారు.యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



జోన్-5 కార్యాలయ కొత్త బిల్డింగ్ ఎలివేషన్ నమూనా



నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతం

మాధవధారలో జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

- జ్ఞానాపురం నుంచి త్వరలో తరలింపు
- సువిశాల స్థలంలో రూ. 2 కోట్లతో కొత్తగా భవన నిర్మాణం
- అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నవైనం

మురళీనగర్, జూన్ 16; విశాఖనగరంలో అతిపెద్దదైన జోన్-5 జ్ఞానాపురం కార్యాలయానికి త్వరలో మోక్షం లభించనుంది. దశాబ్దాలుగా ఈ కార్యాలయం జ్ఞానాపురంలో చిన్నపాటి భవనంలో చాలీచాలని వసతుల మధ్యన నడుస్తోంది. ఈ స్థితిలో ఈ కార్యాలయం త్వరలో మాదవధారలో సువిశాల భవనంలో కొలువు దీరనుంది. దీనికి ఇక్కడ ప్రభుత్వ స్థలం కేటాయించారు. ఈ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 2 కోట్లు జీవీ ఎంసీ నిధులు కేటాయించారు. శంకుస్థాపన పనులు పూర్తి చేసుకుని, ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మాధవధార 51వవార్డులో ఆర్టీఏ కార్యాలయం వెళ్లే మార్గంలో ఉన్న జీవీఎంసీ వాటర్ పంప్ హౌస్ పక్కన ఉన్న ఖాళీగా ఉన్న సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొత్త కార్యాలయానికి కేటాయించారు. ఇక్కడ ఆధునిక డిజైన్‌తో, అత్యాధునిక హంగులతో కొత్త జోనల్ ఆఫీసు రూపుదిద్దుకోనుంది. 24వ వార్డుల పరిధిలో ఉన్న జోన్-5 జ్ఞానాపురంపాత ఆఫీసు పరిపాలనాపరంగానగరంలో ఉన్న మొత్తం 8- జోనల్ ఆఫీసులన్నింటిలో ఇదే పెద్దది. విస్తీర్ణం పరంగానూ 24 వార్డుల పరిధిలో ఈ జోన్-5 ఉంది. దీనిని టెక్నికల్‌గా పార్ట్-ఎ, పార్ట్-బిలుగా రెండుభాగాలుగా చేసిపాలనా వ్యవహారాలు చూస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీవీ. కృష్ణ ఇక్కడి కార్యాలయ జెడ్సీగా వ్యవహరిస్తున్నారు.

విస్తీర్ణం.. ఆదాయం పరంగా పెద్ద జోన్

జోన్-5 జ్ఞానాపురం కార్యాలయం రెవెన్యూ, ఆదాయార్జనలో ప్రథమ స్థానంలో ఉంటుంది. ఈ కార్యాలయ పరిధిలోనే గాజువాక పారిశ్రామిక ప్రాంతం హెచ్‌పీసీఎల్, కోరమాండల్, జింక్ తదితర పెద్ద పరిశ్రమలతోపాటు షాపింగ్ కాంప్లెక్సులు, కల్యాణ మండపాల నుంచి వచ్చే రెవెన్యూ వసూళ్లతో జోన్-5 ఆదాయర్జన పరంగా ఏటా కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. వీటితోపాటు ప్రజారోగ్య విభాగం, వీధి దీపాల నిర్వహణ, ఎలక్ట్రికల్ సహా కీలకమైన యూసీడీ విభాగం,టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలతో జోన్-5 నిత్యం కిక్కిరిసి ఉంటుంది.వివిధ పనుల కోసం వచ్చే వారు, అధికారులతో ఊపిరిసలపని విధంగా తయారైంది. ఇరుకుగదుల్లో సిబ్బంది తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. సొంత కార్యాలయమే అయినా జ్ఞానాపురం ఆఫీసు విశాఖపట్నం విస్తరించక ముందు కొన్ని గదులతో చిన్నపాటి భవనంలో ఏర్పాటైంది. జీవీఎంసీ విస్తరించి గ్రేటరుగా మారిన నేపథ్యంలో ప్రస్తుతం కార్యాలయ మార్పు అనివార్యమైంది.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం

కొత్తగా మాదవధారలో జోన్-5 కార్యాలయం ఆధునిక డిజైన్‌తో నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నాం. సువిశాల స్థలంలో ప్రతి విభాగానికి ఓ ఛాంబర్‌తో పాటు, జెడ్సీ ఛాంబరు, ఇతర సిబ్బందికి గదులతో కొలువుదీరనుంది. జి ప్లస్ త్రి అంతస్తులో నిర్మిస్తున్న ఈ భవనం ఎదుట విశాలమైన పార్కింగ్ స్థలం, పచ్చదనం పెంపునకు తగిన స్థలాన్ని విడిచిపెడుతున్నాం. ఈ ఏడాది చివరి నాటికే పనులను ఓ కొలిక్కి తెచ్చేలా చూస్తాం. దీంతోపాటు నగరంలో మరో 7 జీవీఎంసీ జోనల్ కార్యాలయాల్లోనూ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

- కె.మత్స్యరాజు, ఈఈ, జోన్-5

రక్తదానంపై అపోహలు వీడాలి: జేసీ



ప్రశంసా పత్రమందిస్తున్న జేసీ మయూరి అశోక్

మహారాణిపేట, జూన్ 16: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జిల్లా పరిషత్ జంక్షన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలు, శిబిరం నిర్వాహకులను ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రక్తదానం విశిష్టతను వివరించారు. అపోహలు వీడి రక్తదానికి ముందుకురావాలని కోరారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఫౌండర్ హేన్రీ డ్యూనంట్, రక్త వర్గాలను కనుగొన్న కార్ల ల్యాండ్ ష్టీనర్‌లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ శివ నాగేంద్ర రెడ్డి, విక్రాంత్ హన్మంతు , కొవ్వూరి గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల ఉల్లంఘనపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న పూర్వ వీసీ సత్యనారాయణ

సీతంపేట, జూన్ 16: గ్రామాల్లో కులవివక్ష వ్యతిరేకంగా, సామాజికంగా లింగ సమానత్వ హక్కుల రక్షణపై దృష్టి సారించాలని దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ వై. సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన మానవ హక్కులపై రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ గ్రామాల్లో హక్కుల ఉల్లంఘన జరుగుతుందన్నారు. సంస్థ కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, తమ సభ్యులంతా చట్టాలు, హక్కుల ఉల్లంఘనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అడిషన్ ఎస్పీ ఎస్. దివాకర్, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం షార్ట్ ఫిల్మ్‌ను తిలకించి సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్‌వీ రమణ, వాసిని, వీఎస్‌మూర్తి, సాగర్, అప్పారావు, అబ్దుల్ , రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి విశ్వేశ్వర ఆలయంలో కల్యాణోత్సవాలు



విద్యుత్ దీపాల అలంకరణలో దసపల్లా వద్ద శివాలయం

జగదాంబ కూడలి, జూన్ 16: దసపల్లా మెయిన్ రోడ్డు కూడలి వద్ద ఉన్న శ్రీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారంనుంచి కల్యాణోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ శివాలయానికి ప్రత్యేక ఉంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పూజలు జరుపుతుంటారు. ఈనేపథ్యంలో ఈనెల 17 నుంచి 22 వతేదీవరకు జరిగే కల్యాణోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. సోమవారం మండపారాధన, త్రిశూల పూజ, సాయంత్రం విశ్వేశ్వర స్వామి బాల త్రిపుర సుందరి దేవి కల్యాణ మహోత్సవం, 18, 19, 20, తేదీల్లో ప్రత్యేక హోమాలు, 21 సాయంత్రం 5 గంటలకు నాగవల్లి శేష హోమం, 22న ప్రత్యేక హోమం, రాత్రి 8.30 గంటలకు పుష్పాంజలి సేవ నిర్వహించనున్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నట్ట ఆలయ మేనేజర్ దేవుళ్ల తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

- కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి



రక్తదానం చేస్తున్న చైర్మన్ రాంబాబు, పక్కన ఏయూ మాజీ రిజిస్ట్రార్

అక్కయ్యపాలెం, జూన్ 16: రక్తదానం ప్రాణదానంతో సమానమని కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రజతోత్సవ వేడుకలు పురస్కరించుకుని ఆదివారం ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ రజతోత్సవాల్లో భాగంగా ఈ సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకు సిబ్బందితో పాటు ఖాతాదారులు, శ్రేయోభిలాషులు రక్తదానంలో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఏయూ మాజీ రిజిస్ట్రార్, లయన్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ వెలగపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పలువురి ప్రాణాలు నిలిపేలా ఇలాంటి శిబిరాలను ఏర్పాటు చేసిన బ్యాంకు యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో లీ ఫార్మా లిమిటెడ్ సిబ్బంది బీపీ, షుగర్, ఎముకల పటుత్వంపై తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బ్యాంకు చైర్మన్, సిబ్బంది ఖాతాదారులు, శ్రేయోభిలాషులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, డైరెక్టర్లు డాక్టర్ మోటూరి శ్రీరామకృష్ణ, బి. నాగేశ్వరరావు, వీఆర్వో జీఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతపై కేసులు తక్షణమే ఎత్తివేయాలి

- హోం మంత్రి అనితకు వినతి

సీతమ్మధార, జూన్ 16: గత ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ కోసం పోరాడిన నిరుద్యోగ యువతపై పెట్టిన కేసులు తక్షణమే ఎత్తివేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ సమయం హేమంత్ కుమార్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కోరారు. సీతమ్మధారలోని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఇంటి వద్దకు వచ్చిన హోం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. 2023 జనవరి 22న నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షలో ఉన్న లోపాలను గుర్తించి గ్రేస్ మార్కులు వేసి అభ్యర్థులను తదుపరి పరీక్షలకు అనుమతించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 16 వేల మంది హోంగార్డులకు పీఎఫ్, ఈ ఎస్ఐ, గ్రాట్యూటీతోపాటు మెడికల్ ఇన్సూరెన్స్ కల్పించి, జీతాలు పెంచాలన్నారు. వీరికి కోర్టు తీర్పు ప్రకారం కానిస్టేబుల్ పరీక్షలో రాయితీ కల్పించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును కలిసిన హోం మంత్రి

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంజాయి, మహిళలపై దాడులు, అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు తమ వంతు సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యేను మంత్రి కోరారు.



హోం మంత్రికి వినతి పత్రమిస్తున్న నిరుద్యోగ జేఏసీ నేత హేమంత్‌కుమార్

అలరించిన సినీ సంగీత విభావరి



బృందగానంలో గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, జూన్ 16: మనస్సుకు ప్రశాంతతను ఇచ్చేవి కళలేనని వక్తలు అన్నారు. డాబాగార్డెన్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విజయనగరానికి చెందిన మ్యూజిక్ స్క్వాడ్ సరిగమప వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరికి ముఖ్యఅతిథులుగా ఎం.వి.రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ హాజరై జ్యోతి ప్రజల్వనగావించారు. అనంతరం వారు మాట్లాడుతూ కళలు ద్వారా మన సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేయవచ్చునన్నారు. ఈ సంగీత విభావరిలో ఆలపించిన సినీ గీతాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పి.రాంబాబు, శైలజ మీరజ్, భాగలక్ష్మి, పుండరీకుమార్, రామరాజు, కందర్పరాధ , లక్ష్మీస్వరూప, కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రపై అభిమానంతోనే 'పల్లా'కు పదవి

- విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును నియమితులు కావడంపై విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు హర్షం వ్యక్తంచేశారు. తెలుగుదేశం పార్టీకి తొలి నుంచి అండగా ఉన్న ఉత్తరాంధ్రపై అధినేత నారా చంద్రబాబునాయుడుకు ఉన్న అభిమానంతో పల్లాకు అధ్యక్ష పదవిని బహుమతిగా కేటాయించారన్నారు. ఆదివారం రాత్రి 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో పార్టీ రాష్ట్రఅధ్యక్షులుగా పనిచేసిన కిమిడి కళావెంకటరావు, కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రస్తుతం పల్లా శ్రీనివాసరావు ముగ్గురూ ఉత్తరాంధ్ర వెనుకబడిన వర్గాలకు చెందిన వారేనని గుర్తుచేశారు. పల్లా శ్రీనివాసరావుకు అధ్యక్ష పదవి ఇచ్చి గౌరవించిన అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌లకు అప్పలనాయుడు ధన్యవాదాలు తెలిపారు. పల్లా శ్రీనివాసరావును అభినందించారు. అధినేత నమ్మకాన్ని నిలుపుతారని కలిశెట్టి అప్పలనాయుడు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

పేదల ఇంటి స్థలం కంటే మీ బాత్‌రూమ్ పెద్దది

- రుషికొండ ప్యాలెస్‌పై వైసీపీకి గంటా కౌంటర్

సిరిపురం, జూన్ 16: 'ప్రజల ఆస్తులకు ప్రజా ప్రతినిధులు కేవలం కస్టోడియన్లు అనే వాస్తవాన్ని గ్రహించనంత వరకు ఏ రాజకీయ పార్టీ ప్రజలకు చేరువ కాలేదు' అని మాజీమంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా అన్నారు. విశాఖలోని రుషికొండపై గత ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని ఉద్దేశించి ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. అవసరం ఉన్న చోట అభివృద్ధి పనులు చేపట్టకపోవడం.. అనవసరమైన చోట్ల రూ. వందల కోట్లు దుబారాచేయడం వంటి పనులు చాలా తప్పు అని విమర్శించారు. పేదలకు మీరిచ్చిన ఇంటివిస్తీర్ణం కంటే మీ ప్యాలెస్‌లో బాత్‌రూమ్ సైజు పెద్దదని జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి తన నివాసం కోసంవిశాఖలో 10ఎకరాల విస్తీర్ణం..రూ. 450 కోట్లుకావాల్సి వచ్చిందని ఎద్దేవా చేశారు.ఈ భవంతి కోసం వందలాది మంది స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూమంచి ఆదాయాన్ని తీసుకువచ్చిన హరిత రిసార్ట్‌ను వారం రోజుల్లో నేల మట్టం చేశారన్నారు. ఇవన్నీ దాచేసి సిగ్గు లేకుండా ట్వీట్లు పెడుతున్నారన్నారు.

వీఐపీల విడిది కోసమనడం దిగజారుడుతనమే...

రాష్ట్రపతులు, ప్రధాని , గవర్నర్లు తదితర వీఐపీల పర్యటనల కోసం రుషికొండపై భవన నిర్మాణమని చెప్పడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శమని గంటా అన్నారు. రాష్ట్రాన్ని సొంత జాగీరులా భావించి ఏం కడుతున్నారో కూడా ఎవరికీ తెలియకుండా రూ. వందల కోట్ల జనం సొమ్ముతో అవసరం లేని భవనం కట్టిన మీదీ నిజమైన పైత్యమని విమర్శించారు. ఈ దాష్టీకాలను కూడా గొప్పగా చెప్పుకోవాలని చూస్తే ఇటీవల జరిగిన ఎన్నికల్లో మిస్ అయిన సింగిల్ డిజిట్ 2029 ఎన్నికల్లో ఖాయమవుతుందన్నారు.

వీడిన రాజకోట రహస్యం

... 3వ పేజీ తరువాయి

గంటా బయటపెట్టారు. రూ.500 కోట్ల వ్యయంతో ఏడు బ్లాకుల్లో రుషికొండపై అత్యంత విలాసవంతంగా జగన్ నిర్మించుకున్న భవనాన్ని ఆసాంతం పరిశీలించారు. ఇందులోని ప్రతి వస్తువు అత్యంత ఖరీదైనదే. బాత్రూమ్ నుంచి బెడ్రూమ్ వరకు, హాల్ నుంచి కిచెన్ వరకు.. ప్రతిచోటా వినియోగించిన సామగ్రి, ఫర్నిచర్ కళ్లు చెదిరే రీతిలో ఉన్నాయి. ఇటాలియన్ మార్బుల్ గోడలు, ఇంటర్నేషనల్ బ్రాండ్స్‌తో బాత్రూమ్ ఫిటింగ్స్, ఒళ్లు పట్టించుకోవడానికి మసాజ్ (స్పా) రూములు, భారీ సైజు పడక గదులు, విశాలమైన కారిడార్లు.. ఇలా చెప్పుకుంటూపోతే ఇంద్ర భవనాన్ని తలపించేలా రీతిలో వసతులను ఏర్పాటు చేయించారు. వందలాది మందితో సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా కాన్ఫరెన్స్ హాళ్లు, ఫైళ్లు భద్రపరిచేందుకు లాకర్లు ఏర్పాటు చేశారు. ఏడు బ్లాకుల్లో నిర్మాణాలు చేపట్టగా, వీటన్నింటినీ సొంతానికి వినియోగించుకునేలా డిజైన్ చేయడం గమనార్హం. ఆయా బ్లాకులకు పెట్టిన పేర్లు కూడా రాచరిక వ్యవస్థను గుర్తుచేసేలా ఉండడం మరో విశేషం. భవన నిర్మాణాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో పూర్తిచేశారు. ఈ దృశ్యాలను టీవీలు, సోషల్ మీడియాలోచూసిన ప్రజలు అవాక్కయ్యారు. ప్రజల డబ్బుతో జగన్ తన స్వార్థం కోసంఇంతటిభవనం నిర్మించుకున్నారనే విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

'పల్లా'కు పట్టాభిషేకం

... 3వ పేజీ తరువాయి

పార్టీలో అత్యున్నతమైన రాష్ట్ర అధ్యక్ష పదవిని అధినేత కట్టబెట్టారు. వెనుకబడిన యాదవ సామాజికవర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావు కుటుంబం తెలుగుదేశం పార్టీలో ఉంది. పల్లా తండ్రి సింహాచలం 1994లో విశాఖ-2 నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పల్లా శ్రీనివాసరావు 2020 నుంచి విశాఖ పార్లమెంటు అధ్యక్షునిగా సుమారు నాలుగేళ్లు పనిచేశారు. ఇదిలావుండగా ఉత్తరాంధ్ర నుంచి కిమిడి కళావెంకటరావు, కింజరాపు అచ్చెన్నాయుడు తరువాత రాష్ట్ర అధ్యక్ష పదవి వరించిన మూడో వ్యక్తి పల్లా శ్రీనివాసరావే. ఈ ముగ్గురు కూడా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు కావడం గమనార్హం.

ఘన స్వాగతానికి సన్నాహాలు

గాజువాక: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు విశాఖ రానున్నారు. ఈ తరుణంలో ఎయిర్‌పోర్టులో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ కేడర్ సన్నాహాలు చేస్తోంది. పార్టీలో కీలక పదవి రావడంతో నియోజకవర్గం టీడీపీ శ్రేణులు, అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విమానాశ్రయం నుంచి పల్లా శ్రీనివాసరావును గాజువాక వరకు భారీ ర్యాలీగా స్వాగతించేందుకు అన్ని వార్డుల్లోని టీడీపీ కార్పొరేటర్‌లు, నేతలు సన్నాహాలు చేసుకుంటున్నారు.

జీవీఎంసీపై స్మార్ట్‌సిటీ భారం!

... 3వ పేజీ తరువాయి

12 భవనాలపై సోలార్ రూఫ్‌టాప్‌లు, వన్‌టౌన్‌లోని పురాతనమైన పాత మున్సిపల్ కార్యాలయంతోపాటు టౌన్‌హాల్‌ను హెరిటేజ్ భవనాలుగా అభివృద్ధి, స్మార్ట్ బస్ షెల్టర్‌లు వంటి 51 ప్రాజెక్టులను సుమారు రూ.రెండు వేల కోట్లతో చేపట్టారు. వీటన్నింటినీ దశలవారీగా అమలుచేశారు. కొన్నిప్రాజెక్టులు ఇంకా పూర్తికావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన పదేళ్ల కాలం ఈనెలాఖరుతో ముగుస్తోంది.

ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను పదేళ్లుగా జీవీఎస్‌ఎస్‌ఎల్ చూస్తోంది. ఇందుకోసం ఏటా దాదాపు రూ.పది కోట్లు ఖర్చవుతోంది. ప్రధానంగా సిటీ ఆపరేషన్ సెంటర్ (సీఓసీ), వన్‌టౌన్‌లోని హెరిటేజ్ భవనాల నిర్వహణకే అధికభాగం ఖర్చు పెట్టాల్సివస్తోంది. స్మార్ట్‌సిటీ మిషన్ మరో 15 రోజుల్లో ముగుస్తున్నప్పటికీ ప్రాజెక్టుల తదుపరి నిర్వహణ ఏమిటనేదానిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో ఆ బాధ్యతంతా జీవీఎంసీ భరించకతప్పదని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై స్పష్టత కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖరాశామని చెబుతున్నారు.

తూకంలో గోల్‌మాల్

... 3వ పేజీ తరువాయి

ప్రతినెలా పంపిణీచేసే బియ్యం, ఇతర సరకుల తూకంలో తేడాల మాటేమిటన్న ప్రశ్న ఉదయిస్తోంది.

కార్డుదారులకు ప్రతినెలా గోధుమపిండి, రాగిపిండి, కందిపప్పు (నాలుగు నెలలుగా సరఫరా కావడం లేదు), పంచదార ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తున్నారు. గోదాముల్లో వీటిని బస్తాల్లో లెక్కకట్టి డీలర్లకు సరఫరా చేస్తారు. రేషన్ డిపోల నుంచి ఎండీయూలు తీసుకుని పంపిణీ చేస్తున్నారు. కానీ వాటిని ఏ స్థాయిలోనూ తూకం వేయడంలేదు. కిలో, అరకిలో అని చెబితే తీసుకోవడమే. ఈ ప్యాకెట్లలో కిలోకు 50 గ్రాములు తక్కువగా ఉన్నా ఎవరూ ప్రశ్నించడం లేదు. ఇదంతా ఒక ఎత్తైతే.. బియ్యం సరఫరాలో భారీ అవినీతి జరుగుతోంది. ఉదాహరణకు మర్రిపాలెంలోని గోదాము-1లో డీలర్లకు ఇచ్చే బియ్యం చాలావరకు తూకం వేయరనే ఆరోపణలున్నాయి. 50 కిలోల బస్తాలో ఒకటిలేదా రెండు కిలోలు తక్కువగా ఉన్నా డీలర్లు ప్రశ్నించిన సందర్భాలు తక్కువే. ఉదాహరణకు ఒక డీలరుకు ఆరున్నర టన్నుల 20 కిలోల బియ్యం ఇవ్వాలి. అయితే మర్రిపాలెం గోదాము-1లో ఆరున్నర టన్నులే ఇస్తారు.... ఇదేమిటని అడిగినా సమాధానం చెప్పే వారు లేరు. డిపో పరిధిలో కార్డుల సంఖ్యలో ఉన్న కుటుంబ సభ్యుల వివరాల మేరకు బియ్యం డీలర్లకు సరఫరా చేసినపుడు కచ్చితమైన బరువు తూచివ్వాలి. బియ్యం బస్తా తూకంవేసే సమయంలో గోనె బరువు మినహాయించి ఇవ్వాల్సి ఉన్నా అవేవి పట్టించుకోవడంలేదని డీలర్లు చెబుతున్నారు. మర్రిపాలెం గోదాము-1లో మాత్రం చాలావరకు తూకం వేసి ఇవ్వడంలేని డీలర్లు ఆరోపిస్తున్నారు. బియ్యం సరఫరా సమయంలో గోదాము ఇన్‌చార్జి అందుబాటులో ఉండడంలేదని, ఆయన తరఫున చిరుద్యోగి మాత్రమే ఉంటున్నారని ఉన్నతాధికారులకు డీలర్లు గతంలోనే ఫిర్యాదుచేశారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా కార్యాలయంలో ఎక్కువ సమయం ఉంటూ అప్పుడప్పుడూ గోదాముకు వస్తారని చెబుతున్నారు.

అన్ని గోదాముల్లో తేడాలే...

జిల్లాలో మొత్తం ఆరు గోదాములు ఉండగా, మిగిలిన చోట్ల కూడా తూకంలో తేడాలొస్తున్నాయి. దీంతో కార్డుదారులకు బియ్యం పంపిణీచేసినపుడు కిలోకు 10 నుంచి 20 గ్రాముల వరకు తక్కువగా తూచి ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతినెల జిల్లాలో 5.26 లక్షల కార్డుదారులకు 1900 టన్నుల బియ్యం సరఫరా చేస్తారు. అయితే తూకం వేయడంలో చేతివాటం ప్రదర్శించడంతో రూ.లక్షల అవినీతి జరుగుతోందని పలువురు డీలర్లు ఆరోపిస్తున్నారు. ప్రతినెలా మూడోవారం తరువాత డీలర్లకు సరకులు పంపిణీ ప్రారంభమయ్యే సమయంలో జిల్లా అధికారులు నిఘా వేసి ఇవ్వాల్సిన సరకుల తూకంలో తేడాలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

బినామీ డీలర్లే ఎక్కువ...

ఇదిలావుండగా జిల్లాలో 650 మంది వరకు రేషన్ డీలర్లు ఉండగా 70 శాతం వరకు నగర పరిధిలో ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది బినామీలు ఉండడంతో అధికారులు గోదాముల వద్ద ఇష్టానుసారం వ్యవహరించినా ప్రశ్నించడంలేదు. గట్టిగా మాట్లాడితే చర్యలు తీసుకునే అవకాశం ఉందని వాదన వినిపిస్తోంది. తూకం పక్కాగా ఉండాలంటే పౌరసరఫరాల సంస్థను ప్రక్షాళన చేయాలని పలువురు డీలర్లు కోరుతున్నారు. గోదాముల వద్ద తక్కువగా సరకులు ఇవ్వడం వల్ల కార్డుదారులకు ఇచ్చే బియ్యంలో కోత పడుతోందని చెబుతున్నారు. నగరంలో రేషన్ డీలర్లకు ఇచ్చే సరకుల పంపిణీపై మంత్రి దృష్టిసారించాలని వినియోగదారుల ఫోరం సభ్యులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

అందుకోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేయాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుల విజ్ఞప్తి



దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, తదితరులు

కూర్మన్నపాలెం, జూన్ 16: స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,221వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రైవేటీకరణలపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలు ఎదిరించడంతో కేంద్రం వెనక్కి తగ్గిందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణపై గత సీఎం జగన్ తన స్వప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తేలేదని విమర్శించారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గత సీఎం జగన్ 22 పర్యాయాలు ప్రధాని మోదీని కలిసినా ఒకసారి కూడా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ప్రస్తావించకపోవడంతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు. ఇప్పటికైనా కేంద్రం సానుకూలంగా స్పందించి స్టీల్ ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. 16వ తేదీ వచ్చినా ఉక్కు కార్మికులకు ఈ నెల జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం భావ్యం కాదన్నారు. నాయకుడు విళ్లా రామ్మోహన్‌కుమార్ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంపై ప్రత్యక్షంగా సుమారు 16 వేల మంది ఉద్యోగులు, 17 వేల మంది కాంట్రాక్టు కార్మికులు, పరోక్షంగా లక్షలాది మంది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వీరిలో సగం మంది నిర్వాసితులు ఉక్కు కర్మాగారం కోసం తమ విలువైన భూములను కోల్పోయారన్నారు. అందువల్ల ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను కేంద్రం వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకలు, ఉక్కు ఉద్యోగులు పాల్గొన్నారు.

రాముడి చెరువు మరమ్మతులపై రైతుల్లో చిగురించిన ఆశలు


లక్ష్మీపురంలో పిచ్చిమొక్కలతో నిండిన రాముడి చెరువు

పెందుర్తి-రూరల్, జూన్ 16: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాగు నీటి వనరుల పరిస్థితి మెరుగు పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా 95వ వార్డు పరిధి లక్ష్మీపురం రాముడు చెరువుకు మరమ్మతులు చేపడతారని స్థానిక రైతులు భావిస్తున్నారు. ఈ చెరువు కింద సుమారు 200 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. జలవనరుల శాఖ పరిధిలో గల ఈచెరువుకు దశాబ్ద కాలంగా ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. చెరువు అభివృద్ధి నిమిత్తం ఏర్పడిన సాగునీటి సంఘం కూడా నిధులు లేక నిస్తేజంగా ఉండిపోయింది. ఫలితంగా చెరువులో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి పోయాయి. దీంతో వర్షపు నీరు నిల్వ ఉండడానికి కూడా చెరువు గర్భంలో ఆస్కారం లేకుండా పోయింది. చెరువులోకి వర్షపు నీరు ప్రవహించే పిల్ల కాలువలు కూడా మూసుకుపోయాయి. ఈ కారణంగా పొలాలకు నీరందక గత మూడేళ్లగా రైతాంగం పంటలు వేయలేని పరిస్థితి నెలకొంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరినందున రాముడి చెరువుకు జీవం వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి ఎంపీని కలిసిన స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ నాయకులు


సీఎం రమేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 16: ఎంపీ సీఎం రమేశ్‌ను స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ నాయకులు ఆదివారం అనకాపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, అందువల్ల ఆదుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం విరమించుకునేలా చూడాలని, ప్లాంట్‌కు ఆర్థిక సహాయంతో పాటు అన్ని విధాల సహాయాన్ని అందించాలన్నారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, హనుమంతరావు, గురుప్రసాద్, మధు, కూర్మ, తదితరులు ఉన్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలు ప్రారంభం

గోపాలపట్నం, జూన్ 16: స్థానిక ఇందిరానగర్‌లో మోదకొండమ్మ అమ్మవారి పండుగ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం పుట్టబంగారం తీత కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని పురస్కరించుకుని ఘటాలను ఊరేగిస్తారు. ప్రధాన పండుగైన మంగళవారం వేకువజామున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపాక భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కూర్మన్నపాలెంలో పైడితల్లమ్మ ఉత్సవాలు..

కూర్మన్నపాలెం: వడ్లపూడి సమీపంలోని అప్పికొండ ఏడుగుళ్ల ఆవరణలో ఉన్న పైడితల్లమ్మ వార్షిక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవాలను ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా పైడితల్లమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

టీడీపీ 79వ వార్డు కార్యదర్శిగా వెంకటరావు



అగనంపూడి, జూన్ 16: తెలుగుదేశం పార్టీ 79వ వార్డు ప్రధాన కార్యదర్శిగా మాడిశ వెంకటరావు నియమితు లయ్యారు. అగనంపూడి అన్నపూర్ణానగర్ ప్రాంతానికి చెందిన వెంకటరావు ఇప్పటివరకు బూత్ ఇన్‌చార్జి పనిచేసి ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఎంతో కృషి చేశారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనను వార్డు ప్రధాన కార్యదర్శిగా నియమించడ పట్ల సీఎం చంద్రబాబుకు, గాజువాక ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

కూలిన ప్రహరీని నిర్మించరూ..



మల్కాపురం, జూన్ 16: గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న జీవీఎంసీ తాగునీటి పంప్ హౌస్ ప్రహరీ ఇటీవల కూలిపోయిందని, దీనికి సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రహరీ కూలడం వల్ల దీనికి ఆనుకుని ఉన్న గెడ్డ నీరు భారీ వర్షాలు కూరిస్తే పంప్ హౌస్‌లోకి చేరే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. కాగా ప్రహరీ కూలి ఇక్కడి తాగునీటి పైపునకు రంధ్రం ఏర్పడిందని, దీంతో నీరు వృథాగా గెడ్డలో కలిసిపోతుందని వాపోతున్నారు. అందువల్ల తక్షణమే పైపు లైనుకు మరమ్మతులు చేపట్టడంతో పాటు ప్రహరీని నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాకాహార విశిష్టతపై అవగాహన ర్యాలీ

ఆర్పీపేట (కంచరపాలెం), జూన్ 16: జీవీఎంసీ 57వ వార్డు పరిధి ఆశవానిపాలెంలో ఆదివారం స్థానికులు శాకాహారం విశిష్టతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రానున్న మంగళవారం అమ్మవారి పండుగ నేపథ్యంలో ఇక్కడి లోకల్ బాయ్స్, ఆనందోబ్రహ్మ వారి సహకారంతో సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరుస్తున్నారు. ఇందులో భాగంగా శాకాహారం విశిష్టతను తెలిపేలా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అచ్చయ్యమ్మ, లక్ష్మి, కామేశ్వరరావు, బంగారునాయుడు, గోపి, రాధ, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న సర్వసిద్ధి అనంతలక్ష్మి

68వ వార్డులో టీడీపీ విజయోత్సవం

అక్కిరెడ్డిపాలెం, జూన్ 16: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం టీడీపీ 68వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెంలో విజయోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి కేకు కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. నాయకులు గండికోట తాతారావు, డొప్ప అప్పలరాజు, లంకా మురళి, ఆర్.శ్రీను, ఉప్పిలి శంకరరావు, పి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ :** సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా :** వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 40, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 48, బీరకాయలు 48, ఆనపకాయ 28, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 24, క్యారెట్ 32, దొండకాయలు 34, బంగాళా దుంపలు 34, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 170, బరబటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోస కాయలు 22, వె ల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, క్యర పెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	128
ఫారం ధర	--	148
విత్ స్కిన్	--	266
స్కిన్‌లెస్	--	276

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IVలో..


పంచకర్ల రమేశ్‌బాబు నివాసంలో వంగలపూడి అనిత, తదితరులు

పంచకర్లను కలిసిన హోం మంత్రి అనిత

పెందుర్తి, జూన్ 16: రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పెందుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన పంచకర్ల రమేశ్‌బాబును మర్యాదపూర్వంగా కలిశారు. సీతమ్మధారలో నివాసం ఉంటున్న పంచకర్ల నివాసానికి అనిత రాగా ఆయన ఘనంగా స్వాగతం పలికారు. కీలకమైన హోం మంత్రి పదవి లభించడం పట్ల పంచకర్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి దుశ్శాలువాతో కప్పి అభినందనలు తెలిపారు. అనంతరం వారిద్దరూ ఉమ్మడి విశాఖ జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితిపై చర్చించారు.

ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర


బీజేపీలో చేరిన వారితో మేడపాటి రవీంద్ర, కరణంరెడ్డి, తదితరులు

గాజువాక, జూన్ 16: దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వివిధ వార్డులకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. వారికి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినందున ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. నాయకులు చేబ్రోలు అశోక్, ఎం.దిలీప్‌కుమార్, బొండా యల్లాజీరావు, ఈశ్వరరావు, తాతారావు, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై ఊరేగిన శ్రీవారు


శ్రీవారి శేషవాహన ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 16: ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహోత్స వాల్లో భాగంగా ఆదివారం శ్రీవారిని పెద్ద శేషన వాహనంపై ఊరేగించారు. అనంతరం చేపట్టిన గరుడోత్సవం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ముందుగా వేంకటేశ్వరస్వామిని పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలతో పూజలు జరిపారు. అనంతరం స్వామి వారిని పెద్ద శేష వాహనంపై ఆశీనులను గావించి భక్తుల గోవింద నామ స్మరణల మధ్య ఎస్టీబీఎల్ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం యాగశాలలో పరమాత్మక మహాశాంతి హోమం జరిపాక గరుడోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం దివ్యక్షేత్రంలో అన్న సమారాధన, రాత్రి ఏడు గంటలకు శ్రీవారి కల్యాణోత్సవాన్ని జరపనున్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

అగనంపూడి: అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఈకే చారి తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 22 వరకు ఆలయంలో పూజాది కార్యక్రమాలను జరుపుతామన్నారు. సోమవారం సాయంత్రం స్వామివారి దివ్య తిరు కల్యాణ వేడుకలు నిర్వహిస్తామన్నారు.

ఇండస్ట్రీస్ సేఫ్టీ కోర్సుల అభ్యర్థులకు ప్రాక్టికల్స్



రక్షణపై అవగాహన కల్పిస్తున్న అభ్యర్థులు

కంచరపాలెం, జూన్ 16: ఇండస్ట్రీస్ సేఫ్టీ కోర్సుల అభ్యర్థులకు కంచరపాలెం కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఫైర్ & సేఫ్టీ కోర్సుల అభ్యర్థులకు కళాశాలల ప్రాంగణంలో ప్రాక్టికల్స్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ ఎ.వరహాలు పర్యవేక్షణలో సేఫ్టీ కోర్సుల బోధకుడు డి. తులసీరావు విద్యార్థులకు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు సంభవిస్తే తక్షణం చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రమాదాల రక్షణపై నిర్వహించిన ప్రాక్టికల్స్ ఆకట్టుకున్నాయి. వివిధ పరిశ్రమల నుంచి 23 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

పర్యాటక రంగానికి విశాఖ స్వర్గధామం



పర్యాటక సంస్థను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మహారాణిపేట, జూన్ 16: పర్యాటక రంగానికి విశాఖ స్వర్గధామంగా నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు గణబాబు అన్నారు. ఆదివారం నగరంలోని లయన్స్ క్లబ్ సమీపంలోని ఉడా కాంప్లెక్స్ భవనంలో టూరిజానికు సంబంధించి మేక్ మై ట్రిప్ సంస్థ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలు, ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకు అందుబాటులో ఈ ప్రాంతీయ కార్యాలయం విశాఖలో ఏర్పాటు చేయటం విశేషమని తెలిపారు. విశాఖ వాసులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానం ద్వారా పర్యాటక టూర్‌లు బుకింగ్ చేసుకొనే సౌలభ్యం అందుబాటులోకి వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైడా సంస్థల అధినేత ఫైడా కృష్ణప్రసాద్, సంస్థ మేనేజర్ ఎ. సతీష్, మనీష్, భారతి, వైభవ్, బబిత తదితరులు పాల్గొన్నారు.

30న రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ మీట్

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 16: పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 30న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పారా (దివ్యాంగుల) అథ్లెటిక్స్ మీట్ నిర్వహించనున్నట్టు సంఘం కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. నగరంలో నిర్వహించే ఈ టోర్నీలో రన్స్, త్రోస్, జంప్ ఈవెంట్లలో ప్రతిభ కనబరిచిన అథ్లెట్లను జూలై 15 నుంచి జరిగే జాతీయ పారా అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 25వ తేదీలోగా ఫోన్:70135 69514, 93901 31777లలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సీతారామం భజామ్యహం పుస్తకావిష్కరణ

సీతంపేట, జూన్ 16: డా.సుసర్ల గోపాలశాస్త్రి శతజయంతి ఉత్సవాల సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో శ్రీ సుసర్ల రామగోపాల్ రచించిన 'సీతారామం భజామ్యహం' పుస్తకావిష్కరణ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా డా.కోలవెన్ను మలయవాసిని హాజరై ఆవిష్కరించారు. సభాధ్యక్షులు డా. గండికోట రఘురామారావు, పుస్తక పరిచయం డా.పేరి రవికుమార్, రచయిత స్పందన సుసర్ల రామగోపాల్‌గా వించారు.

సీపీఎం కమిటీకి రూ.లక్ష విరాళం



సీపీఎం నాయకులకు చెక్‌ను అందజేస్తున్న సత్యనారాయణ

కంచరపాలెం/ మురళీనగర్, జూన్ 16: పోర్టులో ఉద్యోగ విరమణ పొందిన మాధవధార ప్రాంతానికి చెందిన కూన సత్యనారాయణ సీపీఎం జిల్లా కమిటీకి రూ.లక్ష విరాళంగా ఆదివారం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి. కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, బి. జగన్‌లకు ఈ చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఎం. జగ్గునాయుడు, ఎం.వి.ఎస్.శర్మ, ఎ. అజయ్‌శర్మ, డా.బి. గంగారావు తదితరులు సత్యనారాయణ సేవలను కొనియాడారు. సత్యనారాయణ చిన్ననాటినుంచి ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తూ వస్తున్నారన్నారు. పోర్టు కార్మికుల సమస్యలపై, పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తనదైన శైలిలో ఉద్యమం చేశారన్నారు.యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



జోన్-5 కార్యాలయ కొత్త బిల్డింగ్ ఎలివేషన్ నమూనా



నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతం

మాధవధారలో జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

- జ్ఞానాపురం నుంచి త్వరలో తరలింపు
- సువిశాల స్థలంలో రూ. 2 కోట్లతో కొత్తగా భవన నిర్మాణం
- అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నవైనం

మురళీనగర్, జూన్ 16; విశాఖనగరంలో అతిపెద్దదైన జోన్-5 జ్ఞానాపురం కార్యాలయానికి త్వరలో మోక్షం లభించనుంది. దశాబ్దాలుగా ఈ కార్యాలయం జ్ఞానాపురంలో చిన్నపాటి భవనంలో చాలీచాలని వసతుల మధ్యన నడుస్తోంది. ఈ స్థితిలో ఈ కార్యాలయం త్వరలో మాదవధారలో సువిశాల భవనంలో కొలువుదీరనుంది. దీనికి ఇక్కడ ప్రభుత్వ స్థలం కేటాయించారు. ఈ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 2 కోట్లు జీవీ ఎంసీ నిధులు కేటాయించారు. శంకుస్థాపన పనులు పూర్తి చేసుకుని, ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మాధవధార 51వవార్డులో ఆర్టీఏ కార్యాలయం వెళ్లే మార్గంలో ఉన్న జీవీఎంసీ వాటర్ పంప్ హౌస్ పక్కన ఉన్న ఖాళీగా ఉన్న సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కొత్త కార్యాలయానికి కేటాయించారు. ఇక్కడ ఆధునిక డిజైన్‌తో, అత్యాధునిక హంగులతో కొత్త జోనల్ ఆఫీసు రూపుదిద్దుకోనుంది. 24వ వార్డుల పరిధిలో ఉన్న జోన్-5 జ్ఞానాపురంపాత ఆఫీసు పరిపాలనాపరంగానగరంలో ఉన్న మొత్తం 8- జోనల్ ఆఫీసులన్నింటిలో ఇదే పెద్దది. విస్తీర్ణం పరంగానూ 24 వార్డుల పరిధిలో ఈ జోన్-5 ఉంది. దీనిని టెక్నికల్‌గా పార్ట్-ఎ, పార్ట్-బిలుగా రెండుభాగాలుగా చేసిపాలనా వ్యవహారాలు చూస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీవీ. కృష్ణ ఇక్కడి కార్యాలయ జెడ్సీగా వ్యవహరిస్తున్నారు.

విస్తీర్ణం.. ఆదాయం పరంగా పెద్ద జోన్

జోన్-5 జ్ఞానాపురం కార్యాలయం రెవెన్యూ, ఆదాయార్జనలో ప్రథమ స్థానంలో ఉంటుంది. ఈ కార్యాలయ పరిధిలోనే గాజువాక పారిశ్రామిక ప్రాంతం హెచ్‌పీసీఎల్, కోరమాండల్, జింక్ తదితర పెద్ద పరిశ్రమలతోపాటు షాపింగ్ కాంప్లెక్సులు, కల్యాణ మండపాల నుంచి వచ్చే రెవెన్యూ వసూళ్లతో జోన్-5 ఆదాయర్జన పరంగా ఏటా కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. వీటితోపాటు ప్రజారోగ్య విభాగం, వీధి దీపాల నిర్వహణ, ఎలక్ట్రికల్ సహా కీలకమైన యూసీడీ విభాగం,టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలతో జోన్-5 నిత్యం కిక్కిరిసి ఉంటుంది.వివిధ పనుల కోసం వచ్చే వారు, అధికారులతో ఊపిరిసలపని విధంగా తయారైంది. ఇరుకుగదుల్లో సిబ్బంది తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. సొంత కార్యాలయమే అయినా జ్ఞానాపురం ఆఫీసు విశాఖపట్నం విస్తరించక ముందు కొన్ని గదులతో చిన్నపాటి భవనంలో ఏర్పాటైంది. జీవీఎంసీ విస్తరించి గ్రేటరుగా మారిన నేపథ్యంలో ప్రస్తుతం కార్యాలయ మార్పు అనివార్యమైంది.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం

కొత్తగా మాదవధారలో జోన్-5 కార్యాలయం ఆధునిక డిజైన్‌తో నాణ్యతా ప్ర మాణాలతో నిర్మిస్తున్నాం. సువిశాల స్థలంలో ప్రతి విభాగానికి ఓ ఛాంబర్‌తోపాటు, జెడ్సీ ఛాంబరు, ఇతర సిబ్బందికి గదులతో కొలువుదీరనుంది. జి ప్లస్ త్రి అంతస్తులో నిర్మిస్తున్న ఈ భవనం ఎదుట విశాలమైన పార్కింగ్ స్థలం, పచ్చదనం పెంపునకు తగిన స్థలాన్ని విడిచిపెడుతున్నాం. ఈ ఏడాది చివరి నాటికే పనులను ఓ కొలిక్కి తెచ్చేలా చూస్తాం. దీంతోపాటు నగరంలో మరో 7 జీవీఎంసీ జోనల్ కార్యాలయాల్లోనూ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

- కె.మత్స్యరాజు, ఈఈ, జోన్-5

రక్తదానంపై అపోహలు వీడాలి: జేసీ



ప్రశంసా పత్రమందిస్తున్న జేసీ మయూరి అశోక్

మహారాణిపేట, జూన్ 16: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జిల్లా పరిషత్ జంక్షన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలు, శిబిరం నిర్వహకులను ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రక్తదానం విశిష్టతను వివరించారు. అపోహలు వీడి రక్తదానికి ముందుకురావాలని కోరారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఫౌండర్ హేన్రీ డ్యూనంట్, రక్త వర్గాలను కనుగొన్న కార్ల ల్యాండ్ ష్టీనర్‌లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ శివ నాగేంద్ర రెడ్డి, విక్రాంత్ హన్మంతు , కొవ్వూరి గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల ఉల్లంఘనపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న పూర్వ వీసీ సత్యనారాయణ

సీతంపేట, జూన్ 16: గ్రామాల్లో కులవివక్ష వ్యతిరేకంగా, సామాజికంగా లింగ సమానత్వ హక్కుల రక్షణపై దృష్టి సారించాలని దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ వై. సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన మానవ హక్కులపై రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ గ్రామాల్లో హక్కుల ఉల్లంఘన జరుగుతుందన్నారు. సంస్థ కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, తమ సభ్యులంతా చట్టాలు, హక్కుల ఉల్లంఘనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అడిషన్ ఎస్పీ ఎస్. దివాకర్, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, సోషల్ మీడియా స్టేట్ ఛైర్మన్ సన్‌మూర్తి, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బెవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం షార్ట్ ఫిల్మ్‌ను తిలకించి సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్వీ రమణ, వాసిని, వీఎస్‌మూర్తి, సాగర్, అప్పారావు, అబ్దుల్ , రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి విశ్వేశ్వర ఆలయంలో కల్యాణోత్సవాలు



విద్యుత్ దీపాల అలంకరణలో దసపల్లా వద్ద శివాలయం

జగదాంబ కూడలి, జూన్ 16: దసపల్లా మెయిన్ రోడ్డు కూడలి వద్ద ఉన్న శ్రీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారంనుంచి కల్యాణోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ శివాలయానికి ప్రత్యేక ఉంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పూజలు జరుపుతుంటారు. ఈనేపథ్యంలో ఈనెల 17 నుంచి 22 వతేదీవరకు జరిగే కల్యాణోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. సోమవారం మండపారాధన, త్రిశూల పూజ, సాయంత్రం విశ్వేశ్వర స్వామి బాల త్రిపుర సుందరి దేవి కల్యాణ మహోత్సవం, 18, 19, 20, తేదీల్లో ప్రత్యేక హోమాలు, 21 సాయంత్రం 5 గంటలకు నాగవల్లి శేష హోమం, 22న ప్రత్యేక హోమం, రాత్రి 8.30 గంటలకు పుష్పాంజలి సేవ నిర్వహించనున్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వాహించనున్నట్ట ఆలయ మేనేజర్ దేవుళ్ల తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

- కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి



రక్తదానం చేస్తున్న చైర్మన్ రాంబాబు, పక్కన ఏయూ మాజీ రిజిస్ట్రార్

అక్కయ్యపాలెం, జూన్ 16: రక్తదానం ప్రాణదానంతో సమానమని కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రజతోత్సవ వేడుకలు పురస్కరించుకుని ఆదివారం ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ రజతోత్సవాల్లో భాగంగా ఈ సేవా కార్యక్రమాలు ఏ ర్పా టు చేశామన్నారు. బ్యాంకు సిబ్బందితో పాటు ఖాతాదారులు, శ్రేయోభిలాషులు రక్తదానంలో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఏయూ మాజీ రిజిస్ట్రార్, లయన్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ వెలగపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పలువురి ప్రాణాలు నిలిపేలా ఇలాంటి శిబిరాలను ఏర్పాటు చేసిన బ్యాంకు యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో లీ ఫార్మా లిమిటెడ్ సిబ్బంది బీపీ, షుగర్, ఎముకల పటుత్వంపై తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మం దు లు పంపిణీ చేశారు. బ్యాంకు చైర్మన్, సిబ్బంది ఖాతాదారులు, శ్రేయోభిలాషులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, డైరెక్టర్లు డాక్టర్ మోటూరి శ్రీరామకృష్ణ, బి. నాగేశ్వరరావు, పీఆర్వో జీఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతపై కేసులు తక్షణమే ఎత్తివేయాలి

- హోం మంత్రి అనితకు వినతి



హోం మంత్రికి వినతి పత్రమిస్తున్న నిరుద్యోగ జేఏసీ నేత హేమంత్‌కుమార్

సీతమ్మధార, జూన్ 16: గత ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీ కోసం పోరాడిన నిరుద్యోగ యువతపై పెట్టిన కేసులు తక్షణమే ఎత్తివేయాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ సమయం హేమంత్ కుమార్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కోరారు. సీతమ్మధారలోని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఇంటి వద్దకు వచ్చిన హోం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. 2023 జనవరి 22న నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షలో ఉన్న లోపాలను గుర్తించి గ్రేస్ మార్కులు వేసి అభ్యర్థులను తదుపరి పరీక్షలకు అనుమతించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 16 వేల మంది హోంగార్డులకు పీఎఫ్, ఈ ఎస్ఐ, గ్రాట్యూటీతోపాటు మెడికల్ ఇన్సూరెన్స్ కల్పించి, జీతాలు పెంచాలన్నారు. వీరికి కోర్టు తీర్పు ప్రకారం కానిస్టేబుల్ పరీక్షలో రాయితీ కల్పించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును కలిసిన హోం మంత్రి

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గంజాయి, మహిళలపై దాడులు, అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు తమ వంతు సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యేను మంత్రి కోరారు.

పేదల ఇంటి స్థలం కంటే మీ బాత్‌రూమ్ పెద్దది

- రుషికొండ ప్యాలెస్‌పై వైసీపీకి గంటా కౌంటర్

సిరిపురం, జూన్ 16: 'ప్రజల ఆస్తులకు ప్రజా ప్రతినిధులు కేవలం కస్టోడియన్లు అనే వాస్తవాన్ని గ్రహించనంత వరకు ఏ రాజకీయ పార్టీ ప్రజలకు చేరువ కాలేదు' అని మాజీమంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా అన్నారు. విశాఖలోని రుషికొండపై గత ప్రభుత్వం నిర్మించిన భవనాన్ని ఉద్దేశించి ఆయన పలు వ్యాఖ్యలు చేశారు. అవసరం ఉన్న చోట అభివృద్ధి పనులు చేపట్టకపోవడం.. అనవసరమైన చోట్ల రూ. వందల కోట్లు దుబారాచేయడం వంటి పనులు చాలా తప్పు అని విమర్శించారు. పేదలకు మీరిచ్చిన ఇంటివిస్తీర్ణం కంటే మీ ప్యాలెస్‌లో బాత్‌రూమ్ సైజు పెద్దదని జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి తన నివాసం కోసంవిశాఖలో 10ఎకరాల విస్తీర్ణం..రూ. 450 కోట్లుకావాల్సి వచ్చిందని ఎద్దే వా చేశారు.ఈ భవంతి కోసం వందలాది మంది స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూమంచి ఆదాయాన్ని తీసుకువచ్చిన హరిత రిసార్ట్‌ను వారం రోజుల్లో నేల మట్టం చేశారన్నారు. ఇవన్నీ దాచేసి సిగ్గు లేకుండా ట్వీట్లు పెడుతున్నారన్నారు.

వీఐపీల విడిది కోసమనడం దిగజారుడుతనమే...

రాష్ట్రపతులు, ప్రధాని , గవర్నర్లు తదితర వీఐపీల పర్యటనల కోసం రుషికొండపై భవన నిర్మాణమని చెప్పడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శమని గంటా అన్నారు. రాష్ట్రాన్ని సొంత జాగీరులా భావించి ఏం కడుతున్నారో కూడా ఎవరికీ తెలియకుండా రూ. వందల కోట్ల జనం సొమ్ముతో అవసరం లేని భవనం కట్టిన మీదీ నిజమైన పైత్యమని విమర్శించారు. ఈ దాష్టీకాలను కూడా గొప్పగా చెప్పుకోవాలని చూస్తే ఇటీవల జరిగిన ఎన్నికల్లో మిస్ అయిన సింగిల్ డిజిట్ 2029 ఎన్నికల్లో ఖాయమవుతుందన్నారు.

వీడిన రాజకోట రహస్యం

... 3వ పేజీ తరువాయి

గంటా బయటపెట్టారు. రూ.500 కోట్ల వ్యయంతో ఏడు బ్లాకుల్లో రుషికొండపై అత్యంత విలాసవంతంగా జగన్ నిర్మించుకున్న భవనాన్ని ఆసాంతం పరిశీలించారు. ఇందులోని ప్రతి వస్తువు అత్యంత ఖరీదైనదే. బాత్రూమ్ నుంచి బెడ్రూమ్ వరకు, హాల్ నుంచి కిచెన్ వరకు.. ప్రతిచోటా వినియోగించిన సామగ్రి, ఫర్నిచర్ కళ్లు చెదిరే రీతిలో ఉన్నాయి. ఇటాలియన్ మార్బుల్ గోడలు, ఇంటర్నేషనల్ బ్రాండ్స్‌తో బాత్రూమ్ ఫిటింగ్స్, ఒళ్లు పట్టించుకోవడానికి మసాజ్ (స్పా) రూములు, భారీ సైజు పడక గదులు, విశాలమైన కారిడార్లు.. ఇలా చెప్పుకుంటూపోతే ఇంద్ర భవనాన్ని తలపించేలా రీతిలో వసతులను ఏర్పాటు చేయించారు. వందలాది మందితో సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా కాన్ఫరెన్స్ హాళ్లు, ఫైళ్లు భద్రపరిచేందుకు లాకర్లు ఏర్పాటు చేశారు. ఏడు బ్లాకుల్లో నిర్మాణాలు చేపట్టగా, వీటన్నింటినీ సొంతానికి వినియోగించుకునేలా డిజైన్ చేయడం గమనార్హం. ఆయా బ్లాకులకు పెట్టిన పేర్లు కూడా రాచరిక వ్యవస్థను గుర్తుచేసేలా ఉండడం మరో విశేషం. భవన నిర్మాణాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో పూర్తిచేశారు. ఈ దృశ్యాలను టీవీలు, సోషల్ మీడియాలోచూసిన ప్రజలు అవాక్కయ్యారు. ప్రజల డబ్బుతో జగన్ తన స్వార్థం కోసంఇంతటిభవనం నిర్మించుకున్నారనే విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

'పల్లా'కు పట్టాభిషేకం

... 3వ పేజీ తరువాయి

పార్టీలో అత్యున్నతమైన రాష్ట్ర అధ్యక్ష పదవిని అధినేత కట్టబెట్టారు. వెనుకబడిన యాదవ సామాజికవర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావు కుటుంబం తెలుగుదేశం పార్టీలో ఉంది. పల్లా తండ్రి సింహాచలం 1994లో విశాఖ-2 నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పల్లా శ్రీనివాసరావు 2020 నుంచి విశాఖ పార్లమెంటు అధ్యక్షునిగా సుమారు నాలుగేళ్లు పనిచేశారు. ఇదిలావుండగా ఉత్తరాంధ్ర నుంచి కిమిడి కళావెంకటరావు, కింజరాపు అచ్చెన్నాయుడు తరువాత రాష్ట్ర అధ్యక్ష పదవి వరించిన మూడో వ్యక్తి పల్లా శ్రీనివాసరావే. ఈ ముగ్గురు కూడా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు కావడం గమనార్హం.

ఘన స్వాగతానికి సన్నాహాలు

గాజువాక: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు విశాఖ రానున్నారు. ఈ తరుణంలో ఎయిర్‌పోర్టులో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ కేడర్ సన్నాహాలు చేస్తోంది. పార్టీలో కీలక పదవి రావడంతో నియోజకవర్గం టీడీపీ శ్రేణులు, అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విమానాశ్రయం నుంచి పల్లా శ్రీనివాసరావును గాజువాక వరకు భారీ ర్యాలీగా స్వాగతించేందుకు అన్ని వార్డుల్లోని టీడీపీ కార్పొరేటర్‌లు, నేతలు సన్నాహాలు చేసుకుంటున్నారు.

జీఎంసీపై స్మార్ట్‌సిటీ భారం!

... 3వ పేజీ తరువాయి

12 భవనాలపై సోలార్ రూఫ్‌టాప్‌లు, వన్‌టౌన్‌లోని పురాతనమైన పాత మున్సిపల్ కార్యాలయంతోపాటు టౌన్‌హాల్‌ను హెరిటేజ్ భవనాలుగా అభివృద్ధి, స్మార్ట్ బస్ షెల్టర్‌లు వంటి 51 ప్రాజెక్టులను సుమారు రూ.రెండు వేల కోట్లతో చేపట్టారు. వీటన్నింటినీ దశలవారీగా అమలుచేశారు. కొన్నిప్రాజెక్టులు ఇంకా పూర్తికావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన పదేళ్ల కాలం ఈనెలాఖరుతో ముగుస్తోంది.

ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను పదేళ్లుగా జీవీఎస్‌ఎల్ చూస్తోంది. ఇందుకోసం ఏటా దాదాపు రూ.పది కోట్లు ఖర్చవుతోంది. ప్రధానంగా సిటీ ఆపరేషన్ సెంటర్ (సీఓసీ), వన్‌టౌన్‌లోని హెరిటేజ్ భవనాల నిర్వహణకే అధికభాగం ఖర్చు పెట్టాల్సివస్తోంది. స్మార్ట్‌సిటీ మిషన్ మరో 15 రోజుల్లో ముగుస్తున్నప్పటికీ ప్రాజెక్టుల తదుపరి నిర్వహణ ఏమిటనేదానిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో ఆ బాధ్యతంతా జీవీఎంసీ భరించకతప్పదని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై స్పష్టత కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖరాశామని చెబుతున్నారు.

తూకంలో గోల్‌మాల్

... 3వ పేజీ తరువాయి

ప్రతినెలా పంపిణీచేసే బియ్యం, ఇతర సరకుల తూకంలో తేడాల మాటేమిటన్న ప్రశ్న ఉదయిస్తోంది.

కార్డుదారులకు ప్రతినెలా గోధుమపిండి, రాగిపిండి, కందిపప్పు (నాలుగు నెలలుగా సరఫరా కావడం లేదు), పంచదార ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తున్నారు. గోదాముల్లో వీటిని బస్తాల్లో లెక్కకట్టి డీలర్లకు సరఫరా చేస్తారు. రేషన్ డిపోల నుంచి ఎండీయూలు తీసుకుని పంపిణీ చేస్తున్నారు. కానీ వాటిని ఏ స్థాయిలోనూ తూకం వేయడంలేదు. కిలో, అరకిలో అని చెబితే తీసుకోవడమే. ఈ ప్యాకెట్లలో కిలోకు 50 గ్రాములు తక్కువగా ఉన్నా ఎవరూ ప్రశ్నించడం లేదు. ఇదంతా ఒక ఎత్తైతే.. బియ్యం సరఫరాలో భారీ అవినీతి జరుగుతోంది. ఉదాహరణకు మర్రిపాలెంలోని గోదాము-1లో డీలర్లకు ఇచ్చే బియ్యం చాలావరకు తూకం వేయరనే ఆరోపణలున్నాయి. 50 కిలోల బస్తాలో ఒకటిలేదా రెండు కిలోలు తక్కువగా ఉన్నా డీలర్లు ప్రశ్నించిన సందర్భాలు తక్కువే. ఉదాహరణకు ఒక డీలరుకు ఆరున్నర టన్నుల 20 కిలోల బియ్యం ఇవ్వాలి. అయితే మర్రిపాలెం గోదాము-1లో ఆరున్నర టన్నులే ఇస్తారు... ఇదేమిటని అడిగినా సమాధానం చెప్పే వారు లేరు. డిపో పరిధిలో కార్డుల సంఖ్యలో ఉన్న కుటుంబ సభ్యుల వివరాల మేరకు బియ్యం డీలర్లకు సరఫరా చేసినపుడు కచ్చితమైన బరువు తూచివ్వాలి. బియ్యం బస్తా తూకంవేసే సమయంలో గోనె బరువు మినహాయించి ఇవ్వాల్సి ఉన్నా అవేవి పట్టించుకోవడంలేదని డీలర్లు చెబుతున్నారు. మర్రిపాలెం గోదాము-1లో మాత్రం చాలావరకు తూకం వేసి ఇవ్వడంలేని డీలర్లు ఆరోపిస్తున్నారు. బియ్యం సరఫరా సమయంలో గోదాము ఇన్‌చార్జి అందుబాటులో ఉండడంలేదని, ఆయన తరఫున చిరుద్యోగి మాత్రమే ఉంటున్నారని ఉన్నతాధికారులకు డీలర్లు గతంలోనే ఫిర్యాదుచేశారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా కార్యాలయంలో ఎక్కువ సమయం ఉంటూ అప్పుడప్పుడూ గోదాముకు వస్తారని చెబుతున్నారు.

అన్ని గోదాముల్లో తేడాలే...

జిల్లాలో మొత్తం ఆరు గోదాములు ఉండగా, మిగిలిన చోట్ల కూడా తూకంలో తేడాలొస్తున్నాయి. దీంతో కార్డుదారులకు బియ్యం పంపిణీచేసినపుడు కిలోకు 10 నుంచి 20 గ్రాముల వరకు తక్కువగా తూచి ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతి నెల జిల్లాలో 5.26 లక్షల కార్డుదారులకు 1900 టన్నుల బియ్యం సరఫరా చేస్తారు. అయితే తూకం వేయడంలో చేతివాటం ప్రదర్శించడంతో రూ.లక్షల అవినీతి జరుగుతోందని పలువురు డీలర్లు ఆరోపిస్తున్నారు. ప్రతినెలా మూడోవారం తరువాత డీలర్లకు సరకులు పంపిణీ ప్రారంభమయ్యే సమయంలో జిల్లా అధికారులు నిఘా వేసి ఇవ్వాల్సిన సరకుల తూకంలో తేడాలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

బినామీ డీలర్లే ఎక్కువ...

ఇదిలావుండగా జిల్లాలో 650 మంది వరకు రేషన్ డీలర్లు ఉండగా 70 శాతం వరకు నగర పరిధిలో ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది బినామీలు ఉండడంతో అధికారులు గోదాముల వద్ద ఇష్టానుసారం వ్యవహరించినా ప్రశ్నించడంలేదు. గట్టిగా మాట్లాడితే చర్యలు తీసుకునే అవకాశం ఉందని వాదన వినిపిస్తోంది. తూకం పక్కాగా ఉండాలంటే పౌరసరఫరాల సంస్థను ప్రక్షాళన చేయాలని పలువురు డీలర్లు కోరుతున్నారు. గోదాముల వద్ద తక్కువగా సరకులు ఇవ్వడం వల్ల కార్డుదారులకు ఇచ్చే బియ్యంలో కోత పడుతోందని చెబుతున్నారు. నగరంలో రేషన్ డీలర్లకు ఇచ్చే సరకుల పంపిణీపై మంత్రి దృష్టిసారించాలని వినియోగదారుల ఫోరం సభ్యులు కోరుతున్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



బృందగానంలో గాయనీగాయకులు

డాబాగార్డెన్స్, జూన్ 16: మనస్సుకు ప్రశాంతతను ఇచ్చేవి కళలేనని వక్తలు అన్నారు. డాబాగార్డెన్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విజయనగరానికి చెందిన మ్యూజిక్ స్క్వాడ్ సరిగమప వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరికి ముఖ్యఅతిథులుగా ఎం.వి.రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ హాజరై జ్యోతి ప్రజల్వనగావించారు. అనంతరం వారు మాట్లాడుతూ కళలు ద్వారా మన సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేయవచ్చునన్నారు. ఈ సంగీత విభావరిలో ఆలపించిన సినీ గీతాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పి.రాంబాబు, శైలజ మీరజ్, భాగలక్ష్మి, పుండరీకుమార్, రామరాజు, కందర్పరాధ , లక్ష్మీస్వరూప, కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రపై అభిమానంతోనే 'పల్లా'కు పదవి

- విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును నియమితులు కావడంపై విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు హర్షం వ్యక్తంచేశారు. తెలుగుదేశం పార్టీకి తొలి నుంచి అండగా ఉన్న ఉత్తరాంధ్రపై అధినేత నారా చంద్రబాబునాయుడుకు ఉన్న అభిమానంతో పల్లాకు అధ్యక్ష పదవిని బహుమతిగా కేటాయించారన్నారు. ఆదివారం రాత్రి 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'తో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో పార్టీ రాష్ట్రఅధ్యక్షులుగా పనిచేసిన కిమిడి కళావెంకటరావు, కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రస్తుతం పల్లా శ్రీనివాసరావు ముగ్గురూ ఉత్తరాంధ్ర వెనుకబడిన వర్గాలకు చెందిన వారేనని గుర్తుచేశారు. పల్లా శ్రీనివాసరావుకు అధ్యక్ష పదవి ఇచ్చి గౌరవించిన అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌లకు అప్పలనాయుడు ధన్యవాదాలు తెలిపారు. పల్లా శ్రీనివాసరావును అభినందించారు. అధినేత నమ్మకాన్ని నిలుపుతారని కలిశెట్టి అప్పలనాయుడు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, జూన్ 16 : భీమిలి డివిజన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాల, పాఠశాలల వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ సహాయ సంక్షేమాధికారి జి.రమాదేవి తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వసతిగృహాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. మధురవాడ సమీకృత వసతి గృహంలో 298 సీట్లు, చిట్టివలస వసతి గృహంలో 74, ఆనందపురంలో 69, భీమిలిలో 63 సీట్లు కోసం 3 నుంచి 10వ తరగతి చదువుతున్న బాల, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. అలాగే మధురవాడ కళాశాల బాలుర వసతి గృహంలో 31, చినగదిలి బాలుర వసతి గృహంలో 22, తగరపువలస బాలుర వసతి గృహంలో 60, భీమిలి బాలుర వసతి గృహంలో 38, పరదేశిపాలెం బాలికల వసతి గృహంలో 44, భీమిలి బాలికల వసతి గృహంలో 58 సీట్లు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు ఆయా వసతి గృహాల సంక్షేమాధికారులను సంప్రతించాలని సూచించారు.

కరకచెట్టు పోలమాంబను దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పెదవాల్తేరు, జూన్ 16 : జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాసరావు పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి, అమ్మవారికి పూజలు జరిపించారు. అనంతరం ఆలయ మండపంలో వేదపండితులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ సంపెంగలతో పూజ చేస్తున్న అర్చకుడు

సింహాచలం, జూన్ 16 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో ఆలయ ముఖ్య అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు జరిపి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కోటి చొప్పున స్వర్ణ సంపెంగలతో స్వామివారిని అర్చించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.

'సంజయ్ గాంధీ కాలనీలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి'

ఆరిలోవ, జూన్ 16 : హనుమంతవాక జంక్షన్ సమీపంలోని విమ్స్ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న సంజయ్ గాంధీ కాలనీలో అన్న క్యాంటీన్‌ను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ విమ్స్‌కు వచ్చే వారికి, ఆటో డ్రైవర్లు, కూలీలకు ఎంతగానో ఉపయోగపడేది. రూ.5లకే అల్పాహారం, భోజ నం అందుబాటులో ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్ మూసివేసి భవనాన్ని సచివాలయంగా మార్చారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **మహారాజ :** మెలోడీ, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), తాతా (తగరపువలస)
- **మ్యూజిక్ షాపు మూర్తి:** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **సత్యభామ :** సంగం, శ్రీకన్య (గాజువాక)
- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **గం గం గణేశా :** వెంకటేశ్వర, శ్రీకన్య (గాజువాక)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 50, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 40, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 48, బీరకాయలు 48, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 24, క్యారేట్ 32, దొండకాయలు 34, బంగాళా దుంపలు 34, అరటి కాయ (పె)7, మునక్కాడలు (కిలో) 64, అల్లం (పాతది) 170, బరబటి 64, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 38, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 140, పొటల్స్ 38, కీరదోస 30, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 42, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడి కాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 128
ఫారం ధర	-- 148
విత్ స్కిన్	-- 266
స్కిన్‌లెస్	-- 276

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IVలో..

శరవేగంగా జోనల్ కార్యాలయం మరమ్మతులు

- రూ. 50 లక్షల జీవీఎంసీ నిధులు కేటాయింపు
- ఈనెలాఖరు నాటికి పూర్తికానున్న పనులు



జోనల్ కార్యాలయం భవనానికి బయట చేస్తున్న పనులు

భీమునిపట్నం, జూన్ 16 : పట్టణంలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులకు జీవీఎంసీ రూ. 50 లక్షలు మంజూరు చేసింది. వీటితో కార్యాలయంలోని రెండతస్తుల్లోనూ మరమ్మతులు చేపడుతున్నారు. ఉన్నతాధికారులు ఈనెలాఖరుకల్లా పనులను పూర్తి చేయాలని ఆదేశించడంతో జోనల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇదే కార్యాలయంలో ఐదు నెలలు క్రితం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 30 లక్షలతో దివ్యాంగుల కోసం ర్యాంప్, రెయిలింగ్, పై అంతస్తులకు వెళ్లడానికి స్టీల్ రెయిలింగ్, వెయిటింగ్ షెడ్ తదితర పనులు చేపట్టారు. మళ్లీ ఇప్పుడు పాత నిర్మాణాలన్నీ తొలగించి జీవీఎంసీ నిధులతో పనులు చేపడుతుండడంతో ప్రజా ధనం దుర్వినియోగం అవుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీలో వున్న 8 జోనల్ కార్యాలయాలు ఒకే డిజైన్‌లో వుండేలా అన్ని విభాగాలకు అనుకూలంగా సెక్షన్‌లు ఏర్పాటు చేస్తూ ఉన్నతాధికారులు ఈ చర్యలు తీసుకున్నారని సిబ్బంది చెబుతున్నారు. భీమిలి మున్సిపాలిటీగా ఉన్నప్పుడు నిర్మించిన భవనంలోనే ఇప్పటివరకు జోనల్ కార్యాలయం కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, ఇపుడు జోనల్ కార్యాలయాల నిర్వహణకు తగ్గట్టుగా అధికారులకు, విభాగాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారని స్థానిక అధికారులు చెబుతున్నారు.

నాణ్యతపై అనుమానాలు

వారం రోజుల్లో పనులను పూర్తి చేయాలన్న ఆదేశాలతో ఆదరాబాదరా చేస్తుండడంతో పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ప్రస్తుతం కార్యాలయంలోనే ప్రజలకు ఇబ్బంది లేకుండా సౌకర్యం విభాగం నిర్వహిస్తున్నారు. పోలీసుస్టేషన్ సమీపంలో వున్న సచివాలయంలో జడ్పీ ఛాంబర్, ఎగువపేట సచివాలయం మేడపై పట్టణ ప్రణాళికా విభాగాలు వున్నాయి. కానీ ఉద్యోగులు జోనల్ కార్యాలయం వద్దే ప్రజలకు అంటుబాటులో ఉంటున్నారు



భీమిలి బీచ్‌లో సందర్శకులు



పర్యాటకులతో కిటకిటలాడుతున్న రుషికొండ బీచ్

తీరంలో పర్యాటక సందడి

భీమునిపట్నం, జూన్ 16 : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. నగరం నలుమూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు సాగరకన్య తీరంలో కడలి కెరటాల్లో ఆటలాడుతూ సరదాగా గడపగా మరికొందరు సముద్ర స్నానాలు చేస్తూ సందడి చేశారు. అలాగే తీరంలో ఉన్న మత్స్యకారుడు, డాల్ఫిన్స్ సమూహాల సోయగాలను తిలకించి ఆనందించారు.

సాగర్‌నగర్ : రుషికొండ బీచ్‌లో సండే సందడి కనిపించింది. వేసవి సెలవులు ముగిసినప్పటికీ సందర్శకుల తాకిడి తగ్గలేదు. భానుడు ప్రతాపానికి ఉక్కపోత తోడవ్వడంతో ఉపశమనం పొందేందుకు ప్రజలు బీచ్‌లను ఆశ్రయిస్తున్నారు. నగరవాసులే కాకుండా హైదరాబాద్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్, ఒడిశా, బెంగళూరు తదితర సుదూర ప్రాంతాల నుంచి కూడా సందర్శకులు విహార యాత్రకు ఇక్కడి వచ్చి బీచ్‌లో సందడి చేస్తున్నారు.

ఆరిలోవ : నగరంలోని జూపార్కును ఆదివారం సుమారు 6487 మంది పర్యాటకులు సందర్శించారు. వారి వద్ద నుంచి రూ. 5. 33 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.



ఎమ్మెల్యే వెలగపూడిని సత్కరిస్తున్న క్రీడాకారుడు రవితేజ

క్రీడాకారుడికి ఎమ్మెల్యే వెలగపూడి అభినందనలు

ఎంవీపీ కాలనీ, జూన్ 16 : తూర్పు నియోజకవర్గం పరిధిలోని 21 వార్డుకు చెందిన గ్రంధి రవితేజ స్విమ్మింగ్‌లో పలు పతకాలు సాధిస్తూ రాష్ట్రానికి ఖ్యాతి తీసుకువస్తున్నాడని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. తండ్రి వెంకటేశ్వరరావుతో కలిసి తన కార్యాలయానికి వచ్చిన రవితేజను వెలగపూడి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవితేజ ఇప్పటివరకు వందకు పైగా పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించాడని చెప్పారు. అనంతరం వెలగపూడిని రవితేజ, ఆయన తండ్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తిరు కల్యాణం

భీమునిపట్నం, జూన్ 16 : పట్టణంలోని సుభాష్ రోడ్‌లో వున్న పురాతన శ్రీ సువర్చల శ్రీదాస ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి తిరు కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు ఏఎం వంశీమోహన చెన్నకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో జ్యేష్ఠ శుద్ధ దశమి పురస్కరించుకుని ఉదయం పదిన్నర నుంచి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మూడో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనం అరగదీస్తున్న ఆలయ సిబ్బంది

సింహాచలం, జూన్ 16 : జేష్టమాస శుక్ల పక్ష పూర్ణిమ నాడు (ఈనెల 22న) అప్పన్నస్వామికి పైపూతగా సమర్పించేం దుకు మూడో విడత చందనం అరగదీత ఆదివారం నుంచి ప్రారంభించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు తరువాత గంధం చెక్కలను అంతరాలయంలో స్వామివారి సన్నిధిలో ఉంచి అర్చకులు పూజలు చేశారు.అనంతరం ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది 18 మంది ముందుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిలలపై సంప్రదాయ దుస్తులు ధరించి చందనం అరగదీశారు. మధ్యాహ్నం రాజభోగం వేళ ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ఏఈఓ ఆనందకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది అరగదీసిన చందనాన్ని తూనిక వేసి ఆలయ పద్మనిధిలో భద్రపరిచారు.

యువకుడ్ని కాపాడిన పోలీసులు

ఎంవీపీ కాలనీ, జూన్ 16 : ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ యువకుడ్ని ఎంవీపీ కాలనీ పోలీసులు కాపాడారు. ఉప్పాడకు చెందిన సంతోష్ (30) కుటుంబ కలహాల కారణంగా ఆదివారం అప్పుఘర్ లుంబినీ పార్కు వద్ద ఉన్న బీచ్‌లో దూకేయడానికి వెళ్లడం చూసిన పోలీసులు సకాలంలో స్పందించి, కాపాడారు. యువకుడ్ని రక్షించిన పోలీసులను పలువురు అభినందించారు. కాగా పోలీసులు ఆత్మహత్యాయత్నం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



సతకంపట్టు వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పద్మనాభంలో దుర్గాలమ్మ పండగ

పద్మనాభం, జూన్ 16 : పద్మనాభంలో దుర్గాలమ్మ అమ్మవారి పండగ ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యింది. ఇప్పటికే అమ్మవారి ఘటాలు ఉండే చదురుగుడి, దుర్గాలమ్మ ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. చదురుగుడి వద్ద అమ్మవారికి పూజారి బుగత గురునాయుడు ప్రత్యేక పూజలు చేసి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా సతకం పట్టు వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడ కూడా తాలాడ అయ్యావారు కుటుంబ సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామంలోని యువకులు ఉత్సాహంగా చేసిన సాముగరిడీలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. అక్కడి నుంచి దేవర పుట్ట వద్దకు వెళ్లి మృత్తిక (మట్టిని) సేకరించి ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. అక్కడ సేకరించిన మట్టిని ప్రత్యేక పాత్రలో వేసి అమ్మవారిని ఆవాహన చేసి ఊరేగింపుగా చదురు గుడికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏఎస్ త్రినాథరావు, టి.పద్దు, ఏ.రమణ, వి. శ్రీను, టి. పైడినాయుడు, వై. నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం ఎన్నికలు

వెంకోజీపాలెం,జూన్ 16 : తెలుగు నాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక మంగళవారం నిర్వహించనున్నట్టు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న కార్యవర్గ సభ్యులు మంగళగిరిలోని కార్యాలయంలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని చెప్పారు.

వెలగపూడిని కలిసిన మంత్రి అనిత



వెలగపూడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనిత

ఎంవీపీ కాలనీ, జూన్ 16 : హోం శాఖా మంత్రి అనిత ఆదివారం ఎంవీపీ కాలనీలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా ఇద్దరూ పరస్పరం అభినందనలు తెలియజేసుకున్నారు.



విస్తరణ చేపట్టాల్సిన అయినాడ-రేవిడి రోడ్డు



లింగన్నపేట వద్ద రోడ్డు విస్తరణ కోసం తవ్విన గోతులు

కలగానే రేవిడి-అయినాడ రోడ్డు విస్తరణ

పద్మనాభం, జూన్ 16 : మండలంలోని రేవిడి-అయినాడ రోడ్డు విస్తరణ పనులు రెండేళ్లయినా పూర్తి కావడం లేదు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని 11.560 కిలో మీటర్ల నిడివి గల ఈ రోడ్డు నిర్మాణానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రెండేళ్ల క్రితం భూమి పూజ చేశారు. రోడ్డు నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం రూ.16 కోట్ల సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేసింది. అయినప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగలేదు. రేవిడి నుంచి వెంకటాపురం, మజ్జిపేట, కోరాడ, లింగన్నపేట, బీఆర్ తాళ్లవలస, బొత్సపేట, అయినాడ తదితర గ్రామాలను కలుపుతూ ఈ రోడ్డు ఉంది. కొన్నిచోట్ల కల్వర్టులు నిర్మించారు. లింగన్నపేట గ్రామం వద్ద రోడ్డుకు ఇరువైపులా విస్తరణ కోసం గోతులు వేసి కొంతమేర వెట్ మిక్సర్, బ్లాక్ మెటలు వేసి చేతులు దులిపేసుకున్నారు. గాయత్రీ ఆలయం సమీపంలో గోతులు తవ్వి వదిలేశారు. ఈ పనులు మినహా ఎటువంటి పనులు సంబంధిత కాంట్రాక్టర్ చేపట్టలేదు. అయినాడలో బాగున్న రోడ్డును తవ్వేసి వెట్ మిక్సర్ వేసి వదిలేశారు. దీంతో గతుకులమయంగా ఉన్న రోడ్డులో ప్రయాణించడానికి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సుమారు 20 గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగానే విజయనగరంలోని పలు ప్రాంతాలకు వెళ్తుంటారు. ఈ రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరు కావడంతో చాలాచోట్ల రోడ్డు శిథిలమైనా సంబంధిత శాఖాధికారులు వార్షిక నిర్వహణ పనులు చేయడానికి కుదరలేదు. రోడ్డు విస్తరణ పనులు పూర్తికాక, శిథిలమయిన చోట్ల మరమ్మతులు చేపట్టక ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.చాలా చోట్ల మలుపులు ఉండడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈఈ గంగరాజు మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు ఇతర చోట్ల చేపట్టిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఈ పనులు నిలిపివేశారన్నారు.



పట్టాభిరామ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వెలగపూడి, వంశీకృష్ణ

టీడీపీలో పట్టాభిరామ్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే వెలగ పూడి రామకృష్ణబాబు

పెదవాల్తేరు, జూన్ 16 : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ తూర్పు నియోజకవర్గంలో పార్టీకి వెన్నెముక వంటి వారని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఆదివారం ఉషోదయ జంక్షన్ వద్ద పట్టాభిరామ్ 62వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అప్రతిహతంగా 2009 నుంచి 2024 వరకు కొనసాగుతున్న తన ఎన్నికల విజయం వెనుక పట్టాభిరామ్ ఉన్నారన్నారు. ఆయన సేవలు పార్టీకి ఎంతో కీలకమని చెప్పారు. అనంతరం వెలగపూడి, దక్షిణ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వెలగపూడి సృజన, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీను, 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, బైరెడ్డి పోతన్న రెడ్డి, సత్తిబాబు, బొట్ట రమణ, కాళ్ల శంకర్, ధర్మారావు, రామలక్ష్మి, పోలారావు, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ వార్షిక పండగ రేపు



పురవీధుల్లో అమ్మవారి ఘటాల ఊరేగింపు

సింహాచలం, జూన్ 16 : వరాహలక్ష్మీనృసింహస్వామి సహోదరి, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ వార్షిక పండగ మంగళవారం జరగనుంది. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 9న చాటింపుతో పండగ ప్రారంభమైంది. 17న తొలేళ్ల ఉత్సవం జరిపేందుకు శతకం పట్టుగుడి వద్ద ఏర్పాట్లు పూర్తిచేశారు. 18న సాయంత్రం జరిగే అనుపోత్సవాన్ని పురస్కరించుకుని మార్గంలో సింహాచలం దేవస్థానం ఈవో సింగాల శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేశారు. తొలేళ్ల ఉత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన గాయకుడు లొడగల రమేష్ సారథ్యంలో గాన విభావరిని సింహాచలం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు సారథ్యంలో శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

తగరపువలసలో రుద్ర హోమం

తగరపువలస, జూన్ 16 : తగరపువలస మెయిన్ రోడ్డులో సంత ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రుద్రాభిషేకం, గాయత్రీ హోమం నిర్వహించారు. తగరపువలస, సంగివలస, చిట్టివలస శాఖలకు చెందిన జగద్గురు ఆది శంకరాచార్య బ్రాహ్మణ పురోహిత, అర్చక సంఘాల ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఈ యాగాలు నిర్వహించారు. కార్యక్రమంలో దార్లపూడి కైలాసం, మధిర రమణ, శంకర శర్మ, ఆర్. బుచ్చి కామేశ్వరశర్మ, ఎన్. శశి భూషణ శర్మ, పి. వెంకటరమణశర్మ, ఎం. రాజేష్, కార్తికేయ, విశ్వేశ్వర శర్మ పాల్గొన్నారు.

102 మందికి హోమియో వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం, జూన్ 16 : పట్టణంలోని చిన్నబజారు డచ్‌రోడ్‌లో వున్న కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆ సంస్థ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. హోమియో వైద్యులు టి. జగన్నాథరావు, టిజి మోహన్ 102 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కెఎస్ఎన్ మూర్తి, కె. చంద్రశేఖర్, కేవీ భానోజీరావు, పద్మజ, శ్రీనివాసరావు, అనురాధ, ఫౌండేషన్ సభ్యులు లక్ష్మణరావు, శ్రీనివాసరావు, రాంబాబు, శంకర్, గంధ రాము, తాతాజీ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న బుల్లితెర నటులు



సింహాచలం, జూన్ 16 : బుల్లి తెర నటులు ఇంద్రనీల్, మేఘన ఆదివారం ఉదయం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని అంతరాలయంలో పూజలు చేయించుకున్నారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బుల్లి తెర నటులను గుర్తించిన కొందరు అభిమానులు వారితో సెల్ఫీలు తీసుకున్నారు.

బీజేపీ, జనసేన జెండాల ఆవిష్కరణ

పెదవాల్తేరు, జూన్ 16 : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరులో ఆదివారం బీజేపీ, జనసేన పార్టీల జెండాలను జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాసరావు, బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు నాయకుడు పీతల అవినాష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బడ్డీల తొలగింపులో వివక్ష



హెచ్‌బీ కాలనీలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన బడ్డీలు

వెంకోజీపాలెం, జూన్ 16 : హెచ్‌బీ కాలనీ ప్రాంతంలో స్టీల్ ప్లాంట్ స్థలాలను ఆనుకుని ఆక్రమణల తొలగింపులో వివక్ష కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో స్టీల్‌ప్లాంట్ స్థలాల విక్రయానికి ఇటీవల ఆ సంస్థ ఆన్‌లైన్‌లో వేలం కోసం సీల్డు టెండర్లు పిలిచింది. దీంతో చాలా మంది కొనుగోలుదారులు ముందుకు వచ్చారు. అయితే ఈ స్థలాల ప్రహరీకి ఆనుకుని ఉన్న బడ్డీలను తొలగించాలని కొనుగోలుదారులు చేసిన ఫిర్యాదు మేరకు సంస్థ ఇక్కడున్న వ్యాపారులకు నోటీసులిచ్చి బడ్డీలను తీసివేయించారు. పాత వెంకోజీపాలెం నుంచి దుర్గానగర్ ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఉన్న బడ్డీలను కూడా తొలగించాలని నోటీసులు జారీ చేశారు. అయితే, హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాలకు వెళ్లే మార్గంలో ఉన్న బడ్డీలకు మాత్రం నోటీసులు ఇవ్వలేదు. కనీసం హెచ్చరించనైనా లేదు. దీనికి కారణం 16వ వార్డు కార్పొరేటర్‌కు చెందిన వైసీపీ నాయకులకు చెందిన బడ్డీలు ఉండడమేనని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ ప్రాంతంలో వైసీపీ నాయకులు అక్రమంగా బడ్డీలు ఏర్పాటు చేసి ఒక్కో దానికి రూ. 5 వేల నుంచి రూ. 6 వరకు అద్దె కూడా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బడ్డీల ఆక్రమణలతో ఇక్కడి డ్రైన్లు శుభ్రం చేయడానికి వీలుకావడం లేదు. ట్రాఫిక్ సమస్య కూడా నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బడ్డీలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.